సంపుటం 13 సంచిక 230 రిజిస్టరు నం. 45 స్థాపిత 1925

గోలకొండపత్రిక

హైద్రాబాదు 25-8-1960 గురువారం సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి ఎం. ఎ. 4 పేజీలు: 7 నయాపైసలు

లావోస్ సైనిక క్లిష్టతల పరిష్కారం

వియంటేన్, ఆగస్టు 24

లావోస్ ప్రతిపాదిత ప్రధాని ప్రిన్స్ సోవన్నా ఫూమా రెండు మూడు రోజుల్లోగా లావోస్ సైనిక వ్యవహారాలు పరిష్కారమై ప్రస్తుత క్లిష్టస్థితి దూరం కాగలదన్నారు.

ప్రిన్స్ సోవన్నాను బలపరచే సైనిక నాయకులు మాజీ రక్షణమంత్రి జనరల్ ఫౌమినోసావన్‌ను బలపరచేనారు కలసి సైనిక జనరల్ స్టాఫ్ పునర్ నిర్మాణానికి ఉపక్రమించారు.

హైద్రాబాద్‌కు జనసంఘ నాయకునిరాక

హైద్రాబాద్, ఆగస్టు 24

అఖిలభారత జనసంఘ అధ్యక్షులు పీతాంబర్ దాస్ ప్రధానకార్యదర్శి దీనదయాళ్ ఉపాధ్యాయ ఇతర మండల కార్యదర్శులతో నేడు హైదరాబాద్‌కు వచ్చారు.

నాంపల్లి రైల్వేస్టేషన్‌లో శ్రీ పీతాంబర్ దాస్‌కు ఘన స్వాగతం ఇవ్వబడినది. పీతాంబర్ దాస్‌కు పూలమాలలు వేయబడినవి. జనసంఘ సుహృద్భావ కార్యకర్తలు హారతిఇచ్చారు ఊరేగింపుద్వారా జనసంఘ అధ్యక్షులు చార్‌కమాన్ వరకు తీసుకొని వెళ్ళబడినారు.

10119

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు లేనందువల్ల ఏర్పడిన కాటక స్థితి

రాజకీయాల నుండి విరమించుకోలేదు

పార్టీనే విడిచిపెట్టినట్లు శ్రీ జయప్రకాశ్ నారాయణ స్పష్టీకరణ

సికింద్రాబాద్, ఆగస్టు 24

సర్వోదయ నాయకుడు శ్రీ జయప్రకాశ్ నారాయణ నిన్న రాత్రి యిక్కడ మాట్లాడుతూ హైదరాబాదు, సికింద్రాబాదు నగరాల విలీనీకరణచర్య పురోగమనాన్నిగాక తిరోగమనాన్ని సూచిస్తుందన్నారు.

"అది జరగకుండా ఉండవలసింది" అని ఆయన సికింద్రాబాదులో ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూఅన్నారు. ప్రజారాజ్యములో అలాంటిది జరగరాదు. విలీనీకరణ సికింద్రాబాదుప్రజల అభిమతానికి విరుద్ధముగా జరిగిందని తనకు చెప్పబడిందన్నారు. ఈప్రశ్నను రాష్ట్రశాసనసభ నిర్ణయించక ప్రజలకే విడువ వలసిందన్నారు.

ఆచార్య వినోబాభావే గతతొమ్మిదేండ్లుగా సాగిస్తున్న ఉద్యమము నీటిలోని మంచుగడ్డ వంటదనీ, పైకితేలే భాగము మాత్రమే అందరికీ కనిపిస్తుందనీ అన్నారు. ఈ ఉద్యమములో కొన్ని లక్షల ఎకరాల భూమి దానం చేయబడటము, పంచిపెట్టి ఉరగడము, కొందరికి పనికల్పించబడటము పైకి కనిపిస్తున్నది, అయితే ప్రజల మనస్సులు, హృదయాలలో వచ్చిన మార్పు యింకా చాలఎక్కువన్నారు.

ప్రజల సమష్టి కృషితో ఏమి సాధించవచ్చునో బీహార్ మాంఘిర్ జిల్లా బెరాయి గ్రామదాన గ్రామములో జరిగిన దాన్నిబట్టి తెలుస్తుందన్నారు. 68 యిండ్లు, 80 ఎకరాల భూమి ఉన్న యీ గ్రామంలో రెండున్నర సంవత్సరాలనుండి విప్లవాత్మకమైన జీవనము ప్రారంభమైనది. అక్కడ నిరుద్యోగములేదు. ఆర్థిక సమానత్వము ఉంది. అందరికీ సమానమైన వేతనము లభిస్తుంది. పిల్లల చదువు, వివాహము, రోగచికిత్సలకు ఖర్చు సమష్టినిధినుండి సమకూర్చబడుతుంది. ఇదంతా ప్రభుత్వ సహాయముతో నిమిత్తము లేకుండా జరిగింది. గ్రామములోని ప్రతివ్యక్తి శ్రమదానముచేసి సమష్టినిధికి తోడ్పడినాడు.

శ్రీజయప్రకాశ్ తన ప్రసంగంలో రాజకీయాల్ని మూడు విభాగాలుగా పేర్కొన్నారు. మంచి సోషలిజమే సర్వోదయమన్నారు. బలవంతాన తేబడిన సోషలిజము వాంఛనీయము కాదన్నారు.

తాను రాజకీయాలనుండి విరమించలేదనీ, పార్టీరాజకీయాలనుండే తప్పుకొన్నానని శ్రీజయప్రకాశ్ అన్నారు. సోషలిజం అంటే ప్రజాసోషలిస్టుపార్టీ అని ముందనుకొన్నాననీ, కాని తన తప్పును గ్రహించాననీ ఆయనన్నారు.

కొందరు తాను రాజకీయాలనుండి విరమించుకోడాన్ని విమర్శించారనీ, మరికొందరు రాజకీయాలలో లేకుండా తాను రాజకీయాలను గురించి ఎలా మాట్లాడుకున్నానని ఆశ్చర్యము వెలిబుచ్చారనీ ఆయనన్నారు. తాను రాజకీయాల్ని విడువలేదనీ, పార్టీని విడిచాననీ తనకుగాని, పార్టీకిగాని అధికారము కావాలని తాను కోరడము లేదనీ ప్రజలకు అధికారము కావాలని కోరుతున్నాననీ ఆయనన్నారు.

మనిషిని చూస్తూ మాట్లాడేవీలైన "విజియోఫోన్"

మాస్కో, ఆగస్టు 24

సోవియట్ దేశంలోవిజియోఫోన్ అనే కొత్త యంత్రము ప్రజలకుప్రదర్శించబడుతున్నది. ఒక మనిషి దూరానగల యింకొకమనిషితో మాట్లాడుతున్నప్పుడు, యీ యంత్రానికి గల తెరపై అవతలి మనిషి బొమ్మ కనిపిస్తూ వుంటుంది.

రష్యాలో దీనిని బి.జఖరోవ్ అనే సోవియట్ ఇంజినీరు 1930 - 40 లోనే కనిపెట్టాడు. ఆ నాడు యిది ఆమోదించబడింది. మాస్కో - లెనిన్ గ్రాడ్‌ల మధ్య విజియోఫోను ఏర్పాటు చేయాలని అనుకున్నారు, కాని యీరెండు నగరాల మధ్య రిలే తీగెలు లేకపోవడం వల్ల అది జరుగలేదు; యిటీవలే యిది ఏర్పాటు చేయబడింది. ప్రయోగాలు ఇంకా జరుగుతున్నాయి; విజియోఫోన్ ద్వారా రంగులను కూడా ప్రసారం చేయవచ్చునని ఇంజినీర్లు అంటున్నారు.

కాంగోలో యుద్ధం రావచ్చు

కసై ప్రెసిడెంట్ హెచ్చరిక

బాక్వాంగ, ఆగస్టు 24: కాంగో నుండి కొత్తగా విడిపోయిన కసై రాష్ట్రానికి అధ్యక్షుడినని ప్రకటించుకొన్న ఆల్బెర్టు కలోంజీ ఒక ప్రకటనలో కాంగోలో త్వరలోయుద్ధం సంభవించ వచ్చునని హెచ్చరించారు

కసై రాష్ట్రాన్ని కాంగో సైన్యం ఎప్పుడయినా దురాక్రమణ జరవచ్చునని తాను భావిస్తున్నట్లు ఆయన విలేఖర్లకు చెప్పారు.

శ్రీ కాకుళం, ప. గో. జిల్లాలు:

యూనిటీ ఫ్రంట్ వారి దుష్ప్రచార ఖండన

రెండు జిల్లాల్లో 36 మందికి 31 మంది తాము అధికార పక్షాన్నే బలపరుస్తామని ప్రకటన

ప.గో. జిల్లా అధ్యక్షునిపై అవిశ్వాసతీర్మానం కూడా

(మా విలేఖరి) హైద్రాబాద్, ఆగస్టు 24

ప్రదేశ్ ఎన్నికల కమిటీ వ్యవహారంలో ప్రదేశ్ అధ్యక్షుడు శ్రీ ఎన్. నరోత్తమరెడ్డి, శాసనసభాపార్టీ నాయకుడు శ్రీ డి. సంజీవయ్యలు నిర్ణయించగల వారినే బలపరుస్తామని స్పష్టంగా పేర్కొంటూ శ్రీకాకుళంనుండి 19 మంది, పశ్చిమ గోదావరి జిల్లానుండి 12 మంది లిఖిత పూర్వకంగా తెలియజేశారు.

శ్రీకాకుళం జిల్లాలో యూనిటీ ఫ్రంటుకే బలమున్నట్లు జిల్లా కార్యదర్శి శ్రీ టి. చిరంజీవిరావు నిన్న చేసిన ఒక ప్రకటనను వీరు అమూలాగ్రం ఖండించారు. శ్రీ చిరంజీవిరావు ప్రకటన సత్యదూరమని పేర్కొంటూ ఒక ప్రతినిధి శ్రీకాకుళంలోని 20 మంది ప్రదేశ్ కాంగ్రెసు సభ్యుల్లో 19 మంది, పశ్చిమ గోదావరి జిల్లాలోని 16 మందిలో 12 మంది తాము పూర్తిగా అధికార పక్షాన్ని బలపరచడానికే నిశ్చయించుకున్నట్లు వ్రాసిన విషయాన్ని నేడు వెల్లడించారు.

అవిశ్వాస తీర్మానం

ఇంతేకాక అధికార పక్షానికి ఎదురుతిరిగి భిన్న ధోరణిలో ప్రవర్తిస్తున్నందుకు పశ్చిమ గోదావరి జిల్లా డి. సి. సి. అధ్యక్షులు శ్రీ కలిదిండి విజయనరసింహ రాజుపై 100 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం తేవడానికి నిర్ణయించారని విశ్వసనీయంగా నేడు తెలిసింది.

పశ్చిమ గోదావరి జిల్లా డిసిసి సభ్యులు మొత్తం 117 గురు త్వరలోనే డి.సి.సి. సమావేశం ఏర్పాటై తన అవిశ్వాస తీర్మానం చర్చకు పెట్ట బడగలదని తెలుస్తున్నది. వీరు తమ బలం పూర్తిగా అధికార పక్షానికే ఉండగలదని పేర్కొంటూ యూనిటీ ఫ్రంట్ వారుల దుష్ప్రచారాన్ని ఖండిస్తూ నేడొక ప్రకటన చేశారు. పి.డబ్ల్యు.డి మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు ప.గోదావరి జిల్లా అధ్యక్షునిపై అవిశ్వాస తీర్మానం తెప్పించాలని ప్రయత్నించి విఫలుడైనట్లు జరుగుతున్న ప్రచారాన్ని వీరు తీవ్రంగా ఖండించారు. ఎవరి ప్రయత్నమూ ఎవరి ప్రోద్బలమూ అవసరం లేకుండానే తాము అధ్యక్షుని ప్రవర్తనకు నిరసన చూపి అవిశ్వాస తీర్మానం తెస్తున్నామనిగూడా వందమంది సభ్యులూ తమ ప్రకటనలో స్పష్టం చేశారు.

కాంగ్రెస్ వర్గాలలో సామరస్య సాధన

ఉప ముఖ్యమంత్రి శ్రీ కొండా వెంకట రంగారెడ్డి కృషి వైఫల్యం

హైద్రాబాద్, ఆగస్టు 24

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాలమధ్య సామరస్య సాధనకై ఉప ముఖ్యమంత్రి శ్రీ కొండా వెంకటరంగారెడ్డి చేసిన కృషివిఫలమైనది. కొండావెంకట రంగారెడ్డిగారు నేడు ఈ విషయాన్ని వెల్లడి చేశారు.

వరదలకు ఒక్కజిల్లాలో 15 గురి మృతి

వేలాది ప్రజలు చెట్లక్రింద తలదాచుకొంటున్న పరిస్థితి

కటక్, ఆగస్టు 24

వరదల వలన సంబల్‌పూర్ జిల్లాలో 15గురువరదలోపోయినట్లు కాంగ్రెస్ శాసన సభ్యుడు శ్రీ విజయ్‌కుమార్ పణి ప్రకటించారు.

వేలాదిపశువులు కొట్టుకొని పోయినవని ఆయనన్నారు.

గండ్లు పడటంవలన రాకపోకలకు అవరోధం కలుగుతున్నది. వేలాది ప్రజలు తమ సర్వస్వాన్ని కోల్పోయి చెట్లక్రింద తలదాచుకొంటున్నారు.

అనధికార ఆహార రిలీఫ్ కమిటీ ఒకటి ఏర్పాటు చేయబడింది. సంబల్‌పూర్ పట్టణ సమీప ప్రాంతాలనుండి వేరుచేయబడింది.

అస్సాం గవర్నర్, ముఖ్యమంత్రి ఢిల్లీ ప్రయాణం

గౌహతి, ఆగస్టు 24

అస్సాం గవర్నర్ జనరల్ శ్రీ నగేశ్, ముఖ్యమంత్రి విమల ప్రసాద్ చాలిహా, హోం ఆర్థిక మంత్రి ఫక్రుద్దీన్ అలిఅహ్మద్ నేటి మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలు దేరినారు.

శ్రీ కృష్ణారున భక్త సమాజం (చంద్ర భాను మఠం ఇసామియా బజార్) వారు శ్రీ గణేశ మహోత్సవము 26 వ తేదీనుండి 31 వ తేదీ వరకు జరుపనున్నారు.

అధికార పక్షాన్నే బలపర్చాలి

డాక్టర్ చెన్నారెడ్డిగారు ఏర్పాటుచేసిన సమావేశంలో మెజార్టి అభిప్రాయం

హైద్రాబాద్, ఆగస్టు 24

డాక్టర్ చెన్నారెడ్డిగారు ఈరోజు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని ఒకటి ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల కార్యకర్తలు పి.సి.సి. సభ్యులు శాసన సభ్యులు పాల్గొనిఉండిరి. సమావేశంచాలా సేపుజరిగింది. ఎన్నికలసంఘపు వివాదము గూర్చి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో మాట్లాడిన వారియందు అత్యధిక సంఖ్యాకులు అధికార పక్షమునే బలపరచ వలెనని ఉద్ఘాటించినారు. ఈ విధముగా అధికార పక్షానికి బలం దిన దినం పెరుగుచున్నది. ఈ సమావేశములో నల్గురైదుగురు తప్ప కడమవారందరు అధికార పక్షానికి అనుకూలముగా అభిప్రాయము వెల్లడి చేసినట్లు తెలుస్తున్నది.

గ్రేటర్ హైద్రాబాద్ కార్పొరేషన్ రాజకీయాలు

ప్రదేశ్ అధ్యక్షునికి, మద్రాసు ముఖ్యమంత్రికి కూడా మెమోరాండం

హైద్రాబాద్, ఆగస్టు 24

గ్రేటర్ హైద్రాబాద్ కార్పొరేషన్‌లోని ఒక వర్గం కార్యక్రమాల నిర్వహణలో బాధ్యతల పంపిణీలో తప్పనిసరి నిర్లక్ష్యపరుస్తూ తమబలం కోసం నష్టశంకుల్ని, మజ్లిస్ కౌన్సిలర్లను కూడా దగ్గరకుతీసి వారికి స్పెషల్ కమిటీల్లో స్థానం ఇస్తామని చెబుతున్నట్లు ఆరోపిస్తూ నిన్న ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షునికి, ప్రదేశ్ వ్యవహారాల పరిశీలనకై యిక్కడికి వచ్చిన మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజనాడార్‌కు నిన్న మెమోరాండం అందజేయబడింది

ఈ మెమోరాండంపై 20 మంది కౌన్సిలర్లు సంతకాలుంచారు.

మేయర్ అభ్యర్థి ఎన్నికకై కాంగ్రెసు కౌన్సిలర్ల సమావేశం గాంధీ భవన్‌లో జరిగినప్పుడు తాము ఇష్టంలేక పోయినప్పటికీ ప్రదేశ్ అధ్యక్షుని మాటను విని ఏకగ్రీవంగా కాంగ్రెసు అభ్యర్థిగా నిర్ణయింపబడిన వారిని బలపరిచి సహకార స్ఫూర్తి చూపగా యిప్పుడు తమను పూర్తిగా అన్ని విషయాల్లోనూ దూరం చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలిసి వీటిని అరికట్టాలని కోరుతూ యీ వర్గం మెమోరాండం సమర్పించింది.

కాబట్టి మున్సిపల్ కాంగ్రెసు పార్టీనియమావళి నిబంధనలు తయారు చేసేప్పుడు ఏవర్గానికి ఎట్టిఅన్యాయము జరుగకుండా జాగ్రత్త తీసుకోవాలని వీరు ప్రదేశ్ అధ్యక్షుని కోరారు

ఈ మెమోరాండంపై కాంగ్రెసు అధ్యక్షునికి రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రదేశ్ కార్యవర్గ సభ్యులకు కూడా అందజేయబడ్డాయి.

ఈ మెమోరాండంపై సంతకాలు చేసినవారు వీరు: శ్రీయుతులు వీరేశంగుప్త, జె. వెంటయ్య, వెంకయ్య, మహాంకాళి, కొండల్ రెడ్డి, రామమూర్తినాయుడు, మహేంద్రజీ పడరినాథ్, జాకీరాం, బండారిమాణిక్యం, రాజపాల్, ఎస్ యాదగిరి, భీష్మదేవ్, బాలారాం, బి ఎం. రాజ్, శివ్వయ్య, బుద్ధరాంగుప్త, ఎస్. ఎం. జిలానీ, శ్రీమతులు కుముదినీదేవి, ఆశాదేవి.

వీరికుండి అరుగురుగల ఒక రాయబారవర్గం నిన్న శ్రీ కామరాజ్ నాడార్‌ను కలిసింది కూడా.

ఫార్మోజాలో అధికవర్షాలు

కైఫె, ఆగస్టు 24

దక్షిణ ఫార్మోజాలో అధికవర్షాల వల్ల 37 వేల మందికి ఇండ్లు లేకుండా ఐనారు. రోడ్డు రైల్వే సౌకర్యాలు పూర్తిగా దెబ్బతిన్నవి.

పరిస్థితుల కనిపెడ్తూ ఉండటానికి కలక్టర్లకు ఆదేశం

అవసర స్థలాలలో సహాయతా చర్యల ప్రారంభించుటకు డబ్బు కేటాయింపు

హైద్రాబాద్, ఆగస్టు 24

ఈసంవత్సరం వర్షాలులేనందువల్ల రాష్ట్రంలో ఏర్పడుతున్న కాటక పరిస్థితుల రెవెన్యూబోర్డు, జిల్లా కలక్టర్లు గమనిస్తూనేఉన్నారని ప్రస్తుతం ఆందోళన చెందవలసిన పరిస్థితి ఏమీలేదని రెవెన్యూబోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు.

పరిస్థితుల కనిపెడుతూ తగుచర్యల తీసుకొనవలసినదిగా జిల్లాకలక్టర్లకు ఆదేశాలివ్వబడినవి.

జిల్లా కలక్టర్లవద్ద వివిధపాము నివారణ కార్యక్రమాల చేపట్టడానికి తగు డబ్బు ఉంచబడినది. అట్టి పరిస్థితులు ఏర్పడగానే సహాయతా చర్యలు ప్రారంభించబడగలవని ఈ ప్రతినిధి సూచించారు.

ఒక అరడజను జిల్లాలలో మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఈనెల చాలినంత వర్షాలు కురవలేదు. శ్రీకాకుళం ఉభయ గోదావరి జిల్లాలలో పంటల పరిస్థితి బాగానేఉన్నది' కొన్ని జిల్లాల కలక్టర్లు చిన్నతరహా నీటివనరులు రోడ్లనిర్మాణంలాంటి పనుల చేపట్టినట్లు తెలిపారు.

శ్రీకాకుళంలో వాల్గున్నర లక్షలు కడపలో మూడు లక్షలు, నెల్లూరులో రు. 3.58 లక్షలు, విశాఖ పట్టణంలో మూడు లక్షలు, అనంతపురంలో ఐదున్నర లక్షలు, చిత్తూరులో నాల్గు లక్షలు, కర్నూలులో 6.2 లక్షలు సహాయతా పనులకై వినియోగించబడుతవి.

ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్, జిల్లాల కలక్టర్ లకు సహాయతా పనుల ప్రారంభించడానికి ఒకొక్కలక్ష వెంటనే కేటాయింప నిర్ణయింపబడినది. ఖమ్మం జిల్లాలో పాలేర్ వైరా లైతుపల్లి చెర్వులకు తగు నీరు రాలేదు. అందువల్ల వీనిక్రింది చాలా భూమిలో విత్తనాలు చల్లలేదు. ఈ చెర్వుల క్రింద వరినాటబడిన భూమికి తగునీరు అందక పోయినచో పంటలు వెడిపోగలవు. పశువు రోజుల్లో వర్షాలు లేకపోతే అలిసేద్యం పరిమిత మవడమేకాక ఖరీఫ్ పంటగూడా సరిగా చేతికిరాదు.

యు. పి. సరిహద్దు ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం

కేంద్రం ఇచ్చిన ఆర్థిక సహాయం వివరాల వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 24

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రపు సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన ఆర్థిక సహాయపు వివరాలు నేడు లోకసభ ప్రశ్నోత్తరాల సమయంలో హోంమంత్రి తెలిపారు.

భక్తదర్శన్ వేసిన ప్రశ్నకు సమాధానమిస్తూ తాత్కాలికంగా రు. 42.90 లక్షలు ఆవృత వ్యయంగాను రు. 59.76 లక్షలు అనావృతవ్యయంగాను మంజూరు చేయబడినవని కేంద్ర హోంమంత్రి వెల్లడించారు. చివరి పద్దులో రు. 20 లక్షలు రోడ్ల నిర్మాణానికి ప్రత్యేకింపబడినవి. కీలకమైన రోడ్లనిర్మాణం మరియు నిర్వహణలో కేంద్రం పూర్తిఖర్చు భరించగలదని చిల్లరరోడ్లనిర్మాణం నిర్వహణలో 75 శాతం ఆర్థిక సహాయాన్ని ఇవ్వగలదని వివరించారు.

అలీఘర్ విశ్వవిద్యాలయ వ్యవహారాలు

విచారణ కమిటీ నివేదిక

వత్సరాంతానికల్లా సిద్ధం

కొత్తఢిల్లీ, ఆగస్టు 24

అలీగర్ విశ్వవిద్యాలయ వ్యవహారాల విచారిస్తున్న చటర్జీ కమిటీ వర్తమాన సంవత్సరాంతంలో తన పనిని పూర్తి చేయగలదని ఆశింపబడుతున్నదని విద్యామంత్రి శ్రీ మాలి నేడులోకసభలో సూచించారు.

ఈ కమిటీ కొంత ఆలస్యంగా తన పనిని ప్రారంభించడం వల్ల ఈ ఆగస్టు నెలలో తన రిపోర్టును సిద్ధంచేయజాలకపోతున్నదని శ్రీ మాలి తెలిపారు.

భోపాల్‌లో టెలిఫోన్ శాఖ

భోపాల్, ఆగస్టు 24.

దాదాపు వెయ్యిరూపాయలుఇవ్వ తేలినందున ఇక్కడి మూడు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు 21 రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల టెలిఫోన్ కనెక్షన్‌ల ఇక్కడి పి అండ్ టి డిస్‌కనెక్టు చేసినది.

పోలీసు దాడిలో 30 మంది అరెస్టు

హైద్రాబాద్, ఆగస్టు 24

జూద మాడుచున్నందులకు, దేవాలిసారాయిని చట్టవిరుద్ధంగాఅమ్ముచున్నందులకు నిన్న సుల్తాన్‌బజార్ పోలీసువారు అసిస్టెంట్ కమిషనర్ శ్రీప్రకాశ్ సింగ్ ఆధ్వర్యంలో దాడి చేసి 30 మందినిఅరెస్టుచేశారు. వారిలో 11 నుండివద్ద నట్టచిట్టీలు, రు. 61-50 నయాపైసలు మొత్తాన్ని పోలీసులు వశపరచుకొన్నారు. మిగతా 19 మంది దొంగసారా వ్యాపార నేరంక్రింద అరెస్టయినారు. వారివద్ద గ్యాలనుల సారాయి చిక్కినది.

పార్టీ రహిత ప్రజా స్వామ్య ఉద్యమం

సత్యాగ్రహం- తదితర కార్యక్రమ నిర్వహణకు చర్యాకమిటి ఏర్పాటు

హైద్రాబాదు, ఆగస్టు 24

పార్టీ రహిత ప్రజాస్వామ్యంపై శ్రీ గోరా అధ్యక్షతన మూడురోజుల పాటు సభలు జరిగినతరువాత కొన్ని నిర్ణయాలు తీసుకోబడినవి.

ప్రజలలో పౌరస్వత్వ బాధ్యతల వ్యాపింప చేయడానికి ప్రజాస్వామ్యాన్ని గూర్చి జాగృతిని కల్గించుటకు తగు వాతావరణాన్ని సృష్టించాలని అందుకై పార్లమెంటునుండి గ్రామ పంచాయతి స్థాయివరకు సత్యాగ్రహాన్ని చేపట్టాలని ఈ సభలందు పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడినారు.

స్టడీక్యాంపుల నిర్వహణ, సాహిత్య ప్రచురణ, పదయాత్రలు ప్రజల పార్టీ రహిత ప్రజాస్వామ్యంగూర్చి విజ్ఞానవంతుల చేయగలవని పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహాన్ని నడుపడంవల్ల సాధారణ ప్రజలకు ప్రభుత్వానికి అధినేతలుతాముకామని పార్టీలని తెలియ చెప్పినట్లు అవుతుందనిగూడా ఒక అభిప్రాయానికి రావడమైనది.

శ్రీయుతులు గోరా, వి. వీరభద్రరావు, సి. రంగప్ప, కాళోజి నారాయణరావు తదితరులతో ఒక చర్యా సంఘం ఏర్పరచబడినది. ఈ కమిటి సత్యాగ్రహ కార్యక్రమాన్ని ఉద్యమాన్నిరూపొందించగలదు. ఈకమిటి తొలుత కార్యకర్తల సమీకరించగలదు.

యూనో సభ్యత్వానికి 8 ఆఫ్రికారాజ్యాలు

భద్రతా సంఘం సిఫారసు

ఐక్యరాజ్యసమితి, ఆగస్టు 24

ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వానికి 8 ఆఫ్రికారాజ్యాలను సిఫారసు చేస్తూ ఫ్రాన్సు, ట్యునీషియాలు తెచ్చిన తీర్మానాన్ని గతరాత్రి భద్రతా సంఘం ఆమోదించింది.

ఆ కొత్త ఆఫ్రికా రాజ్యాలు ఇవి: దహోమీ, నిగెర్, అప్పర్ వోల్టా, ఐవరీకోస్టు, చాద్ రిపబ్లిక్, కాంగో, గాబన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్.

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 21న ప్రారంభ మవుతుంది. ఈ సిఫార్సులన్ని ఆది ధ్రువీకరిస్తుంది.

మాజీ ఫ్రెంచి కాంగోకు వచ్చే అసెంబ్లీసెషన్‌లోగా ఏదో ఒక స్పష్టమయిన పేరు నిర్ణయించుకోవలసిందిగా సూచించబడింది.

పండిత ఇంద్ర విద్యా వాచస్పతి మృతి

న్యూఢిల్లీ, ఆగస్టు 24

రాజ్యసభ మాజీ సభ్యుడు పండిత ఇంద్ర విద్యా వాచస్పతినిన్నసాయంత్రం తన 71వ ఏట మృతిచెందారు. ఆయన సంస్కృత కమిషన్ సభ్యుడు గురుకుల కంగ్రీ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలరుకూడా.

మాలీ సైనికులు తెచ్చిన సంఘర్షణలో యిద్దరి మృతి

ఇంకాపలువురు గాయపడినారని కటంగా ప్రభుత్వ ప్రకటన

ఎలిజబెత్‌విల్లె, ఆగస్టు 24

మాలీ ఫెడరేషన్ దళాలు తమ ఆఫీసర్ల కంట్రోలు నుండి బయల్దేరడంతో నిన్న జరిగిన తీవ్ర సంఘటనలలో యిద్దరు కాంగో వారు చనిపోయారని కటాంగా ప్రభుత్వం ప్రకటించినది.

మాలీ సైనికులు తమ ఆఫ్రికా, ఐరోపా ఆఫీసర్ల మాటను వినడానికి నిరాకరించారు. ముగ్గురు ఐరోపా వారు సైనిక శిబిరంలో తలదాచుకొన్నారు.

కటాంగా ప్రభుత్వం నేటిరాత్రి ఒక ప్రకటనచేస్తూ నిన్నటి సంఘటనలో చాలమందిగాయపడినారని పేర్కొన్నది.

పూర్వ ఫ్రెంచి సూడాన్, సెనెగల్ నుండి మాలీ ఫెడరేషన్ విడిపోవడంతో సమితిలోని మాలీదళాలు ఉపసంహరించుకో బడాలని కోరబడింది.

కటాంగా ప్రభుత్వ నిరసన

విడిపోయిన మాలీ ఫెడరేషన్ సైనికులు సమితి సైన్యంలో ఉంటుండగా అధికారుల కంట్రోలు తప్పడం వలన ఆల్బెర్టు విల్లేలో జరిగిన సంఘటనపట్ల కటాంగా ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి దళాల కమాండర్ బ్రైన్నాకు తీవ్రఅసమ్మతిని తెలిపింది.

మాలీదళాలు తిరుగుబాటు జరుపలేదని సమితి రాజకీయ ఆఫీసర్ బెర్నెండ్సన్ నిన్న పేర్కొన్నారు. ఆవిధంగా వచ్చిన వార్తల్ని ఆయన ఖండించారు.

ఒరిస్సా వరదబాధితులు

గవర్నర్ శ్రీ గచార్ చే 2 వేల విరాళం

హైద్రాబాద్, ఆగస్టు 24

ఒరిస్సా వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర గవర్నర్ శ్రీ భీమసేన సచార్ రూ. 2వేలు పంపించారు. ఒరిస్సా గవర్నర్ శ్రీ సుక్తాంకర్‌కు యీమొత్తం పంపబడింది

...—

"ట్రేడ్ యూనియన్ హక్కు దినోత్సవాన్ని" సెప్టెంబరు 2న జరుపడానికి ఎఐటియూసి,ఆర్.ఎం.ఎస్ డబ్ల్యు.డి.యు సిల ఆధ్వర్యాన ఊరేగింపు లావాడు నిర్వహించడానికి నిర్ణయించబడింది.

హైదరాబాదు సమీప గ్రామాలకు నష్టం

ప్రభుత్వం ప్రజల్ని ఆదుకోవాలని శ్రీమద్దూరు కామేశ్వరరావు విజ్ఞప్తి

సరూర్‌నగర్, ఆగస్టు 24

ఇటీవల ఇక్కడ జరిగిన బహిరంగ సభకు అధ్యక్షత వహిస్తూ లింగోజీగూడ సర్‌పంచ్, ఆంధ్ర ప్రజాపార్టీ సంయుక్త కార్యదర్శి అయిన శ్రీ మద్దూరు కామేశ్వరరావు వర్షాలు లేక హైదరాబాదు సమీప గ్రామాల బావులలో నీరులేక పొలములో మొక్కలు ఎండిపోతున్నవనీ, పశువులకు గడ్డికూడ లేకుండా పోతున్నదనీ అన్నారు. పంటల నష్టమువలన ధరలు పెరిగే అవకాశము ఉందనీ, అందువలన తక్కావీ ఋణాల్ని వసూలు చేయకుండా నిలిపివేయాలనీ, సహకార సంఘాలద్వారా ప్రజావసరాలకు కావలసిన పదార్థాల్ని సరఫరా చేయాలనీ విజ్ఞప్తి చేశారు.

లింగోజీగూడ గ్రామములోగల సాలార్జంగ్ సెషన్‌కోర్టు భవనములో ప్రభుత్వ పాఠశాల, దాని ప్రక్కనగల సాలార్జంగ్ ఖాళీస్థలము ఆటస్థలముగా ఉన్నవనీ, ఆ ఆటస్థలములో తగు ఆటవస్తువులు సమకూర్చడానికి ధనసహాయాన్ని చేయాలని హయత్‌నగర్ పంచాయతీసమితిని కోరారు.

సమితి ఉపాధ్యక్షులు శ్రీ టి. రామయ్యగుప్త శ్రీ కామేశ్వరరావు చెప్పిన విషయాలతో ఏకీభవిస్తూ అందుకు తగు కృషి చేస్తానని వాగ్దానం చేశారు.

లోకసభలో మూడవ ప్రణాళిక ముసాయిదాపై చర్చ

రెండవ ప్రణాళిక ఫలితాల సంఘటితం చేసుకోవాలని ఆచార్య కృపలానీ సలహా

న్యూఢిల్లీ, ఆగస్టు 24

మూడవ ప్రణాళికకు ఉపక్రమించలోయేముందు రెండవ ప్రణాళికలో చేపట్టిన ఆశయాల సంఘటితం చేసుకోవాలని అధిక ధరలు, వస్తువులు ద్రవ్యోల్బణతో ప్రజలకు విశ్రాంతి లేకుండా పోతున్నదని ఆచార్య కృపలానీ మూడవ ప్రణాళిక ముసాయిదాపై లోకసభలో నేడు కొనసాగిన చర్చలో పాల్గొంటూ అన్నారు

ఈ తరంవారికి శ్రమ నాటిన వృక్షపు ఫలాల్ని అనగా పంచవర్ష ప్రణాళికల ఫలితాల కొద్దిగానైనా రుచిచూపాలని కోరారు వీరు.

మూడవ ప్రణాళిక ముసాయిదాపై నేడు జరిగిన చర్చలో ప్రణాళికా అమలులో ప్రజా సహకారాన్ని రాబట్టాలని దుబారా వ్యయాన్ని ద్రవ్యోల్బణాన్ని తగ్గించాలని నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మెడికో సోషల్ వర్కర్లకై ప్రత్యేక కళాశాల

హైదరాబాద్, ఆగస్టు 23

మెడికో సోషల్ వర్కర్లకు శిక్షణ ఇవ్వడానికి అన్ని హంగులుకల కళాశాల ఏర్పరచబడగలదని రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ మేజర్ కె. ఎన్. రావు వెల్లడిచేశారు.

రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేయడానికి వచ్చే రెండు సంవత్సరాలలో 400 మెడికో సోషల్ వర్కర్లు కావలసి ఉన్నారు.

పోయిన యౌవనము

మరియు ఆరోగ్యమును సంపాదించి మళ్ళీ తమ జీవితానందమును యోగ్యతను సంపాదించుకొనుటకు నేడే సుప్రసిద్ధ డాక్టరు చౌహాన్ గారితో వెంటనే సంప్రదించండి. డాక్టర్ గారు తమ 40 సంవత్సరాల దివ్యానుభవముతో నిరాశచెందిన వేలకొలది యువకులకుజీవించడానికిఇచ్ఛను, ఉత్సాహాన్ని కలుగజేశారు. ఈ సువర్ణావకాశమువల్ల లాభము పొందండి. స్త్రీ పురుషులకు ఉన్న గుప్త వ్యాధులను గూడా నమ్మకంగా బాగుచేశారు.

సంప్రదింపులకు సమయాలు: ఉ॥ 8 గం॥ నుంచి రాత్రి 8 వరకు

కుల్టీప్ మెడికల్ హాల్, నాంపల్లిచమన్, పబ్లిక్ గార్డెన్ రోడ్ హైదరాబాదు.

శార్వరి సం॥ భాద్రపద శు॥ తదియ
సా 5-4 ఉ ఫ ఉ 7-51
సా వ 4-31 మొ; 6-10 వరకు
(శాలివాహన శకము: 3-6-1882)
1960 ఆగస్టు 25 గురువారము

"దమియించఁ దగిన వారల సమయమున దమించి వారి సంపదలు మహీరమణుండు దనదు బండారముగా సమకూర్చు జనము రాగిల్లంగన్."

భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 3280

1960 ఆగస్టు 25
గురువారము

మూడవ ప్రణాళిక

లోకసభలో మూడవ ప్రణాళిక మీద జరిగిన ఉపన్యాసాల వివరాలు పత్రికలలో ప్రకటితమైనవి. ఈ ప్రణాళిక మీద చర్చను ప్రారంభించుచు, ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ గావించిన ప్రసంగములో మూడవ ప్రణాళిక ఆశయాలు, ప్రాతిపదికలు చక్కగా వివరించియున్నారు. ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి ఆవశ్యకతను శ్రీ నెహ్రూ చక్కగా నిరూపించియున్నారు. ఇది విజ్ఞాన యుగము; నేటి సాంకేతికాభివృద్ధిని గమనించి నప్పుడు యే దేశము యొక్క అభివృద్ధియైనను నిర్ణీత ప్రణాళిక ప్రకారము జరుగవలసి యుండునను సత్యము స్పష్టమగు చున్నది. ప్రణాళిక అవసరము లేదని కొందరు చేయు వాదము అసంగతమైనది; అనర్థకమైనది. వ్యక్తులకు, కుటుంబాలకు గూడ ప్రణాళిక అవసరమగు చుండగా, దేశానికి ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి అనివార్యమనుసత్యము నిరాక్షేపణీయమైనది. ఈ విషయమును ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ తమ ప్రసంగములో మిక్కిలి యుక్తి యుక్తముగా వివరించియున్నారు.

మూడవ ప్రణాళికను ప్రత్యేకముగా విడదీయుటకువీలు లేదు. రెండవ ప్రణాళికలో మూడవ ప్రణాళికకు సన్నిహితమైన అవినాభావ సంబంధము కలదు. నిజానికి, యీ రెండు ప్రణాళికలను ఒకపుస్తకములోని రెండు అధ్యాయాలని చెప్పవచ్చును. కావున, యీదృష్టితో మూడవ ప్రణాళికను పరిశీలించవలసి యుండును. రెండవ ప్రణాళికలో మన జాతీయ ఆదాయము నూటికి నలుబదిరెండు వంతులు పెరిగినది. అయినప్పటికిని, దేశములో అనేకులకు లాభము కలుగలేదు. చాలమందికి యీ జాతీయ ఆదాయపు పెరుగుదల ఉపయుక్తము కాలేదు. అయినప్పటికిని, కొందరికైనను యిందువలన ప్రయోజనము కలిగినదను సత్యము నిస్సందేహమైనది. ఈ రోజు మనదేశములోని పట్టణాలను, పల్లెటూళ్ళను పరిశీలించినప్పుడు, పెంకుటిండ్లను కట్టుకొని, కడుపునిండ భుజించి, ఒడలినిండ బట్టకట్టుకొని, ఆర్థికముగా అభివృద్ధి పొందిన కుటుంబాలను యెన్నింటినో చూడవచ్చును. ఈ ఆర్థిక అభివృద్ధి మన జాతీయ ఆదాయపు పెరుగుదలకు దర్పణముగా నున్నది. ఈ అభివృద్ధి వలన ప్రయోజనము దేశములోని సమస్త వ్యక్తులకు కలుగవలసి యుండును. మన ప్రణాళికల పరమ ప్రయోజనము యిదియేనని శ్రీ నెహ్రూ స్పష్టీకరించినారు. ఈ ప్రయోజనమును సాధించుట కొరకు, యీ నాడు దేశములో ప్రణాళికల ద్వారా, పథకాలద్వారా బ్రహ్మాండమైన కృషి జరుగుచున్నది. రెండవ ప్రణాళికలో గుర్తించిన మన జాతీయ ఆదాయపు పెరుగుదలను నిర్దేశించుట కొరకు నిపుణులతోకూడిన ఒక సంఘమును నియమించవలెనని శ్రీ నెహ్రూ యీ సందర్భమున చేసిన సూచన మిక్కిలి ఉపయుక్తమైనది. ఈ విధముగా నిర్దేశించుట వలన భవిష్యత్తులో మనము అమలు చేయవలసిన విధానాలను నిర్ణయించు కొనుటకు ఉపయుక్తము కాగలదు.

శ్రీ నెహ్రూ తమ ప్రసంగములో సామ్యవాదసరళి సమాజ స్థాపననుగూర్చి, సహకార విధానాల అనుసరణనుగూర్చి మరొక పర్యాయము ఉద్ఘాటించి యున్నారు. రెండవప్రణాళికలో విద్యారంగమున జరిగిన అభివృద్ధినిగూర్చి ప్రస్తావించి, మూడవ ప్రణాళికలో యీ అభివృద్ధి ప్రగతిని మరింత వేగపరచవలసిన అవసరమును నొక్కి చెప్పి, అందుకు అవలంబించ దలచిన విధానాలను వివరించినారు. ప్రజలలో విజ్ఞానవ్యాప్తి దేశాభివృద్ధికి మిక్కిలి ఆవశ్యకము. దేశమును పారిశ్రామికముగా అభివృద్ధి చేయవలెననినచో, ప్రజలలోవిజ్ఞాన ప్రచారము మిక్కిలి ముఖ్యము. ఈ సత్యమును శ్రీ నెహ్రూ సహేతుకముగా వివరించినారు. భారీ పరిశ్రమల వ్యాప్తి ఆవశ్యకతను శ్రీనెహ్రూ ఉద్ఘాటించి, దేశము ఆర్థికముగా స్వయం సమృద్ధము కావలెనని సూచించినారు. కేవలము, చిన్నతరహా పరిశ్రమల వలన అది సాధ్యము కాజాలదనియు బొగ్గు, ఉక్కు మొదలైన భారీ పరిశ్రమల వ్యాప్తియందును అత్యంత ఆవశ్యకమనియు, మొదటి ప్రణాళికలో ఉక్కుపరిశ్రమాగారమును చేర్చనందువలన మనకు కొంత నష్టము కలిగినదనియు, యీ లోటును దీర్చుటకు రెండవ ప్రణాళికలో మూడు ఉక్కుకర్మాగారాలను చేర్చినందువలన మనమీద భారము యెక్కువ పడినదనియు శ్రీనెహ్రూ సవివరముగా తెలియజేశారు. మూడవ ప్రణాళిక పూర్తియగువరకు దేశము ఆర్థిక స్వయం సమృద్ధతను సాధించగలదని శ్రీనెహ్రూ ఆశించినారు. మూడవ ప్రణాళిక ఆశయాలను వివరించుచు, జాతీయ ఆదాయములో నూటికి మరొక అయిదువంతుల పెరుగుదల, ఆహారధాన్యాల విషయములో స్వయం సమృద్ధత, ఎగుమతుల కొరకు మరియు పరిశ్రమల కొరకు కావలసిన వ్యవసాయ ఉత్పత్తులను తగినంతగా పెంచుట, ప్రాతిపదిక పరిశ్రమలైన బొగ్గు, ఉక్కు, విద్యుచ్ఛక్తి మొదలైన వానిని అభివృద్ధిచేయుట, దేశములోని సర్వ సంపదలను సంపూర్ణముగా వినియోగించుటను, ధరలను అదుపులో నుంచుట, సమాజములోని ఆర్థిక వ్యత్యాసాలను తగ్గించుట మొదలైనవి యిందులో ముఖ్యమైనవని శ్రీ నెహ్రూ వివరించినారు. ఈ వివరణ మన ప్రణాళికల ఆశయాలను సమగ్రముగా తెలియజేయుచున్నది.

అనంతపురం జిల్లాలో దుర్భర క్షామం

అనంతపురం, ఆగస్టు 24

జిల్లా పరిషద్అధ్యక్షులు శ్రీ ఎ. చిదంబరరెడ్డి, (ఎం.ఎల్.ఎ.) ఇలా ప్రకటిస్తున్నారు:

"అనంతపురంజిల్లాలోగతమూడేండ్లుగా సకాల వర్షములు లేనందున పరిస్థితులు అధ్వాన్నమైనవి. ఈ సంవత్సరము గూడ ఇంతవరకు వర్షములు రానందున మరింత దుర్భరమైపోయినది. చెదరుగా కొన్నిచోట్ల కొద్దిపాటి వానలు వచ్చినందున వేయబడిన ముంగారి పైర్లు పూర్తిగా దెబ్బతిని పోయినవి. ఇప్పుడు వర్షము వచ్చినా ఆ యెండిపోయిన పగుడు చిగురించే ఆశలేదు. వరుసగా నాలుగేండ్ల కాలము వానలు లేనందున బావులలో జలయెండిపోయినది. బావిడీ ఆసగాతో బాధలు భరించి తిండిగింజలయినా పండించుకోవడానికి వీలులేకున్నది. కరువు నివారణ పనుల కిచ్చిన గ్రాంటు రెండు లక్షల రూపాయలు యేమూలకూ చాలలేదు గ్రామాల్లో ధాన్యంలేదు పశువులకు మేత లేదు. కూలీలకు పనిలేదు. ఈ స్థితిలో ఫిర్కా కేంద్రాలలో చౌకధాన్యం డిపోలు పెట్టినప్పటికీ అవి కొనుక్కోడానికైనా జనసామాన్యం దగ్గర డబ్బులులేవు. ఆకలితో యేర్పడే బలహీనత వ్యాధులు అప్పుడే ప్రారంభమైనవి. ప్రభుత్వం వెంటనే తీవ్రమైన చర్యలు తీసుకొని కరువు నివారణ పనులను ప్రారంభించి చౌకధాన్యం డిపోలను విస్తృతంచేసి రైతులకు అప్పులు విరివిగా ఇచ్చి అన్ని విధాలా తగుమైన కృషి చేయకపోతే ఆకటి చావులు తప్పేటట్లు లేదు.

ఇంతటి దారుణ పరిస్థితిలో జిల్లా అల్లాడిపోతుండగా "అనంతపురంజిల్లాలో అక్కడక్కడ వర్షములు వచ్చినవి పరిస్థితులు కొంత మెరుగ్గానున్నవి" అని రివిన్యూ బోర్డు అభిప్రాయపడడము వింతైన విషయం. ఇప్పటికైనా ప్రభుత్వం తమ దృష్టిని ఈక్షామపీడిత ప్రాంతములపైసారించి వెంటనే క్షామ నివారణ కార్యక్రమాలకు నిధులను కేటాయించి చౌకడిపోలను విస్తృతం చేసి పశుగ్రాసాన్ని కూడ తెప్పించి రోడ్డుపనులతోపాటు కుటీర పరిశ్రమలను కూడా అక్కడక్కడ స్థాపించి ఈ భయంకర క్షామము నుండి కాపాడడానికి పూనుకుంటుందని ఆశిస్తున్నాను. వెంటనే ఒక ఉన్నతస్థాయి గిని జిల్లాకు పంపి పరిస్థితులు స్వయముగా పరిశీలించే యేర్పాట్లుచేయడం ప్రభుత్వం యొక్క కనీస ధర్మంగా గుర్తించవలెనని కూడా విజ్ఞప్తిచేస్తున్నాను."

తూర్పు గోదావరి జిల్లాలో కాటక స్థితి

తూర్పు గోదావరిజిల్లా ఏలేశ్వరం మేజర్ పంచాయతీ బోర్డు అధ్యక్ష ఉపాధ్యక్షులు శ్రీ సామంతుల దొరయ్య, శ్రీ మూడి సూర్యనారాయణస్వామి ఈ క్రింది ప్రకటన చేస్తున్నారు:

"ఏలేశ్వరం ప్రాంతంలో ఈ సంవత్సరంలో ఏ రెండు మూడుసార్లో తప్ప సరైన వర్షాలే కురవలేదు. ఆ రెండు మూడుసార్లు కురిసిన వర్షాల ఫలితంగా చాలా మంది రైతులు త్వరపడి ఊడ్చిన పొలాలు మళ్ళీవర్షం లేనందువలన గత రెండు వారాల నుంచి తీవ్రగాలులతో కూడిన విపరీతమైన ఎండలుకాయడంచేత నెత్రెలు పగిలి ఎండిపోయాయి.

"ఈ గ్రామ సమీపంలో దాదాపు రెండు వేల ఎకరాల విస్తీర్ణంగలిగి 8 వేల ఎకరాలకు నీరు సప్లయిచేసే "తిమ్మరాజు చెరువు" ఇప్పుడు ఒక్కచుక్క కూడా నీరులేక బీటలు వారిపోయింది. పైగా ఇప్పటికే ఆకుమడులు బాగా పెరిగి ముదిరిపోయాయి. ఇంకా వారం రోజులవరకు ఇలాగే వర్షాలు కురవకపోతే ఆ ఆకుమడులు కూడా పనికివచ్చేటట్లులేవు

కాబట్టి ప్రభుత్వం వారు వెంటనే ఈ ప్రాంతంలో చౌకధాన్యం డిపోలను నెలకొల్పి పేద ప్రజానీకాన్ని ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నాము."

డా॥ ఎల్లా ప్రగడ సుబ్బారావుకు జోహార్లు

ఢిల్లీ ఆంధ్ర సంఘంచే వర్ధంతి సమావేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 24

"అవకాశాలు కల్పిస్తే ఆంధ్రులు తమ అగ్రగణ్యతను నిరూపించుకోగలరు. ఫోలిక్ ఆసిడ్, పెంట్రోజోన్ ఆరోమైసిన్ మొదలగు అద్భుతౌషధములను ప్రపంచమునకు అందించిన మహాశాస్త్రవేత్త డాక్టరు ఎల్లాప్రగడ సుబ్బారావు ఆంధ్రుడు. ఆ మహాపురుషుని సంస్మరణ ఆంధ్రుల కర్తవ్యం" అని కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ నీలం సంజీవరెడ్డి డాక్టరు ఎల్లా ప్రగడ సుబ్బారావు వర్ధంతి సమావేశములో అన్నారు.

కరోల్‌బాగ్ ఆంధ్ర సంఘం యీ నెల 18న చేసిన ఈ సమావేశమునకు శ్రీ మొసలికంటి తిరుమలరావు అధ్యక్షత వహించారు. కేవలం డిగ్రీ తీసుకోవడమే లక్ష్యముగా కాకుండా వైద్యపరిశోధనలో ఆసక్తి వహించి డాక్టరు ఎల్లాప్రగడ అడుగుజాడలలో నడచి, ఆంధ్రులపేరు, సుబ్బారావు గారిపేరు నిలబెట్టవలసిన బాధ్యత ఆంధ్ర వైద్య విద్యార్థులపై వుందని శ్రీ తిరుమలరావు అన్నారు.

అసిస్టెంటు డైరెక్టరు జనరల్ ఆఫ్ హెల్తు సర్వీసెస్ డాక్టరు వై. కె. సుబ్రహ్మణ్యం బొంబాయి ఆంధ్రవిద్యాసంస్థ అధ్యక్షులు, లెడర్లీ లేబరేటరీస్ జనరల్ సేల్స్ మేనేజరు శ్రీ వి ఆర్. స్వామి ప్రఖ్యాతవృక్షశాస్త్రవేత్త డాక్టర్ బి. వి. నాథ్ తమ ప్రసంగాలలో స్వర్గీయ సుబ్బారావుకు జోహారర్పించారు.

శ్రీ మాచిరాజు రామచంద్రరావు వందన సమర్పణతో సభ ముగిసింది.

దేశం మొత్తంమీద 241 తెలుగుపత్రికలు

అందులో 74.7 శాతం ఆంధ్రప్రదేశ్ నుండి, 28 శాతం హైదరాబాద్ నుండి ప్రచురణ

హైదరాబాద్, ఆగస్టు 24

మద్రాసు నుంచి ప్రచురించబడుతున్న ఆంధ్రపత్రిక మినహా తక్కిన తెలుగు దినపత్రికలన్నీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే నెలకొని ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్ వార్తాపత్రికా పరంపర విజయవాడ, చిత్తూరులలో ఏర్పాటు కావడంతో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు వార్తాపత్రికల సంఖ్య పెరిగింది.

దేశంలో మొత్తం 241 తెలుగు పత్రికలు ప్రచురణకాగా, 180 తెలుగు పత్రికలు అంటే నూరింట 74.7 వంతులు 1959 లో ఆంధ్రప్రదేశ్ నుంచే వెలువడుతున్నాయి. ఎక్స్‌ప్రెస్ వర్గానికి చెందిన 5 దినపత్రికలు కలపడముతో, ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం దినపత్రికల సంఖ్య 19 నుంచి 27 కి పెరిగింది. వాటి సర్క్యులేషను 1958 తో పోలిస్తే, 1959 లో నూటికి 22వంతులు పెరిగింది.

ఆంధ్రప్రదేశ్ పత్రికా ప్రపంచంలో కన్పించే ఒక ముఖ్య విశేషం ఏమిటంటే, పత్రికలన్నీ కొద్ది తావులలో కేంద్రీకృతమై ఉండకుండా, అనేక స్థలాలలో వికీర్ణమై ఉన్నాయి. రెండు దినపత్రికలతో సహా నూరింట 50 పైచిల్కు పత్రికలు 1 లక్ష జనాభాలోపుగల పట్టణాల నుంచే ప్రచురితమవుతున్నారు. తక్కిన పత్రికలు రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాదు, 1 లక్ష పైచిల్కు జనాభాగల 5 ఇతర పట్టణాలమధ్య ఇంచుమించు సమంగా పంపకం అయినాయి.

సమీక్షా సంవత్సరంలో రాష్ట్రంలో 64 కొత్త వార్తాపత్రికలు ప్రారంభంకాగా, 7 వార్తాపత్రికలు ప్రచురణ విరమించాయి. కొత్తగా అవతరించిన పత్రికలలో, చిత్తూరులోని ఎక్స్‌ప్రెస్ వార్తాపత్రికల మూడు ప్రచురణలతో కలుపుకుని మొత్తం 9 దినపత్రికలు ఉన్నాయి. సమీక్షా కాలంలో ప్రచురణ విరమించిన 7 పత్రికలలోను ఏ పత్రికకూ కూడా 1958 లో 2,000కు పైచిల్కు సర్క్యులేషను లేదు.

1959 డిసెంబరు 31 న ఆంధ్రప్రదేశ్‌లో 27 దినపత్రికలతో సహా మొత్తం 350 వార్తాపత్రికలు ప్రచురణ అవుతున్నాయి. 27 దినపత్రికలలో 25 సాధారణ వార్తాపత్రికలు. రెండు "బి" తరగతి దినపత్రికలు.

(ఈ క్రింది రకాల పత్రికలు "బి" తరగతిలో చేరుతాయి:-

మార్కెటు బులెటిన్లు; వాణిజ్య సర్క్యులర్లు; విద్యాసంస్థల మాగజైన్లు; వాణిజ్య సంస్థలు వెలువరించే ప్రచార పత్రికలు; గృహ పత్రికలు; సీరియల్ నవలలు; జ్యోతిశ్శాస్త్రం; రేసింగు క్యాలెండర్లు; ధరల జాబితాలు; లారిపోర్టులు; క్రాస్‌వర్డుబులెటిన్లు; అడ్వర్టయిజ్మెంటు బులెటిన్లు; వగైరా... పోతే ఇతర రకాల పత్రికలు "ఏ"తరగతికి చెందినవి)

దినపత్రికలు మినహా ఇతర పత్రికల సంఖ్య 321. వారపత్రికలు 98; పక్షపత్రికలు 3 ; మాసపత్రికలు 148; త్రైమాసిక పత్రికలు; అర్ధ సంవత్సర పత్రికలు, మొదలైనవి 20; వార్షిక పత్రికలు 25 ఉన్నాయి. వీటిలో ఏ-తరగతికి చెందినవి 287; బి-తరగతికి చెందినవి 41 ఉన్నాయి. కాగా ఇందులో మొత్తం తెలుగు పత్రికల సంఖ్య 180.

సమీక్షా సంవత్సరంలో 64 కొత్త వార్తాపత్రికలు ప్రారంభం అయినాయి. 7 వార్తాపత్రికలు ఆగిపోయాయి. 1959 లో ఆగిపోయిన 7 వార్తాపత్రికలలో ఒకటి ఇంగ్లీషుది; 5 తెలుగువి; ఒకటి ద్విభాషాపత్రిక. కొత్తగా వెలువడ నారంభించిన 64 పత్రికలలో 28 తెలుగువి.

రాష్ట్రంలోని మొత్తం వార్తాపత్రికలలో నూరింట 28 పత్రికలు హైదరాబాదు నుంచి వెలువడుతున్నాయి. 51 శాతం 1 లక్షలోపు జనాభాగల జిల్లా పట్టణాలనుంచి వెలువడుతున్నాయి.

1958 లో 204 పత్రికల సర్క్యులేషను 3.53 లక్షలని తేలింది. 1959లో 216 పత్రికల సర్క్యులేషను 4.54 లక్షలని తేలింది; కాగా ఇందులో తెలుగు పత్రికల సర్క్యులేషను 2.83 లక్షలు. మొత్తం 87 తెలుగు పత్రికల సర్క్యులేషను 1958 లో కన్నా పెరిగింది.

మొత్తం వివిధ భాషా పత్రికలలో నూరింట 55 వంతులు అంటే, 127 పత్రికలు వ్యక్తిగత యజమానులచేతులలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ ఒక తెలుగు మాస పత్రికను నిర్వహిస్తోంది. జిల్లా కాంగ్రెసు కమిటీ "ఆంధ్రశ్రీ" అనే ఒక తెలుగు వారపత్రికను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం తాలూకు ఒక డిపార్టుమెంటు అధీనంలో ఒక పత్రిక, రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో 8 పత్రికలు నడుస్తున్నాయి.

తెలుగులో ఆయా ప్రత్యేక విషయాలకు సంబంధించిన పత్రికలు ఎన్ని నిర్వహించబడుతున్నదీ దిగువ వివరించబడింది:

విజ్ఞానం-1; వైద్యం,ఆరోగ్యం-13; మహిళాభ్యుదయం-8; చిత్రజగత్తు-12; రవాణా రాకపోకలు-1; వ్యవసాయ, పశుపోషణ- 4; సీరియలు నవలా సాహిత్యం-2.

ఆదాయం పన్ను బకాయలు 133 కోట్లు

అయితే గత సంవత్సరముకంటె యిది తక్కువని మురార్జీ

న్యూఢిల్లీ, ఆగస్టు 24

1960 మార్చి 31 కు ఆదాయపు పన్ను బకాయలు రు. 133 కోట్ల 61 లక్షలవరకూ ఉన్నవనీ, 1959 లో ఆ దే తేదీకి అనిరు. 125 కోట్ల 36 లక్షల వరకూ ఉన్నవనీ ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ నేడు లోకసభలో శ్రీమధుసూదనరావుప్రశ్నకు లిఖితపూర్వకంగాసమాధానంచెబుతూ అన్నారు.

కోర్టులో షేకబ్జులా వాజ్మాలం

ఐక్యరాజ్యసమితి సభ్య రాజ్యాలకు పంపిణీ

న్యూయార్కు, ఆగస్టు 24

ఐక్యరాజ్య సమితిలోని పాకిస్తాన్ ప్రతినిధివర్గం నిన్న ఒక ప్రత్యేక పత్రాన్ని ఇతర సభ్యరాజ్యాల ప్రతినిధులు అందరికీ అందజేసింది. జమ్ము స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఆగస్టు 8 న షేకబ్జులా ఇచ్చిన ప్రకటన ఆ పత్రములోఉంది

షేకబ్జులా ప్రస్తుతంవిచారించబడుతున్న విషయము పాఠకులెరిగినదే.

పోస్టుమన్‌కు ప్రధాని అభినందనలు

హైదరాబాద్, ఆగస్టు 24

సికింద్రాబాద్ సెంట్రల్ పోస్టాఫీసుకు చెందిన మహ్మద్ అక్బర్ అను పోస్టుమన్ బాధ్యతాయుతమైన ప్రధాని శ్రీ నెహ్రూ ప్రశంసతోషాన్ని అభినందనలను తెలిపారు.

పదేళ్ళపాటు నెలకు రు. 5చొప్పున తన జీతం నుండి కోసుకొని పంచవర్ష ప్రణాళికా ఖర్చులకు వినియోగించాలిందిగా ఆపోస్టుమన్ ప్రకటించిఉన్న విషయం పాఠకులెరిగినదే. ఈ మొత్తాన్ని ప్రణాళికా ప్లానింగ్ కమిషన్‌కు గాని, ప్రధాని జాతీయ సహాయతా నిధికి గాని పంపించవలసిందిగా కోరుతూ ప్రధాని ప్రైవేటు సెక్రటరీ శ్రీ పి. ఎం. సహాయ్ శ్రీ మహ్మద్ అక్బర్‌కు లేఖ వ్రాశారు

సిలోన్ ప్రధానమంత్రికి నెహ్రూ ఆహ్వానం

నవంబరులో రావలసిందని

కొలంబో, ఆగస్టు 24

సిలోన్ ప్రధానమంత్రిణి శ్రీమతి శిరిమావో బండారు నాయకేను నవంబరులో భారతదేశానికి రమ్మని కోరుతూ ప్రధాని నెహ్రూ ఆహ్వానము పంపినట్లు ఇక్కడి సిలోన్ డైలీ న్యూస్ పత్రిక వ్రాసింది.

ఈ వార్తను సిలోన్ ప్రభుత్వాలు, భారత హైకమీషన్ కార్యాలయము ధృవపరచనూ లేదు, ఖండించనూ లేదు.

ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ అధ్యక్షులు శ్రీ మాడపాటి హనుమంతరావు రోజు ఉదయము 11 గంటల నుండి 1 గంట వరకు విజిటర్స్‌ను కలువగలరు. వారి ఫోన్ నెంబర్ 34975.

క్రీడారంగం:-

ఒలింపిక్ పోటీలకు భారత ఆటగాళ్ళు

రోమ్‌లో యీనెల 25వతేదీ నుంచి జరిగే 17వ ఒలింపిక్ ఆటలపోటీలలో పరుగు, కుస్తీ, షూటింగు మొదలైన పందెములలోనూ, హాకీ, ఫుట్‌బాల్ మొదలయిన ఆటలలో పాల్గొనేందుకు గాను భారత ఆటగాళ్ళు వెళ్ళారు- భారతదేశం నుంచి ఈ పదాది వెళ్ళినంతమంది బహుశా ఇదివరకెన్నడూ ఏ అంతర్జాతీయపోటీకి వెళ్ళలేదేమో.

జాతీయ ఆటల పోటీలలోనూ అలాంటి యితర పోటీలలోనూ ప్రదర్శించిన ప్రావీణ్యాన్ని బట్టిఆటగాళ్ళను ఎంచుకోవడం జరిగింది. ఇందుకుగాను, ఒలింపిక్ పోటీ ప్రమాణాలకు సమమైన ఉన్నత ప్రమాణాలు నిర్ణయించారు. ఆటగాళ్ళ ఎన్నిక జరిగిన అనంతరం వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాలలో గట్టిశిక్షణ ఇచ్చారు

ప్రపంచంలో హాకీఆటలో 1928 నుంచి భారత దేశానిదే పైచెయ్యిగా వుంది. ఇతర పందెములలో కూడా మంచినైపుణ్యం ప్రదర్శించగల ఆటగాళ్ళు కూడా యీసారి వెళ్లిన భారత బృందంలో వున్నారు. వారిలో భారత సైనిక శాఖకుచెందిన జమేదార్ మిలాసింగ్ ఒకరు, 2వందలు మీటర్లు, 4 వందల మీటర్ల పరుగు పందెములలో ఆయన ఆసియా రికార్డునూ, కామన్‌వెల్తు రికార్డునూ స్థాపించారు. 4 వందల మీటర్ల పరుగులో ఆయన యీసారి ఒలింపిక్ బహుమతి పొందగలడని అనుకుంటున్నారు. ఆ పోటీలోనే ఆయన పాల్గొనవచ్చు. పరుగు పందెంలో లాల్‌చంద్, 20 కిలోమీటర్ల నడకపందెంలో జోరాసింగ్ కూడా ఒలింపిక్ పోటీలో మంచి స్థానాన్నే పొందగలరని ఆశించబడుతోంది

20మంది సభ్యులతో కూడిన హాకీ బృందంలో యువకులూ వున్నారు. మంచి అనుభవంగడించిన వారూ ఉన్నారు. 1926లో అమ్‌స్టర్‌డంలో జరిగిన ఒలింపిక్ పోటీలో వారు తొలిసారిగా హాకీ ఆటలో ప్రథమ స్థానం సాధించారు. అప్పటినుంచీ నేటివరకూ హాకీఆటలలో ప్రపంచంలోకల్ల భారతదేశానిదే అగ్రస్థానముగా వుంటూ వచ్చింది. ఈమధ్య సంవత్సరాలలో చాలాదేశాలు హాకీఆటలో నైపుణ్యం సంపాదించాయి. ఈసారి భారత హాకీ జట్టుకు నాయకుడు లెస్లీ క్లాడియస్, ఆయన యింకకుముందు లండన్, హెల్సింకీ, మెల్‌బోర్న్‌లలో జరిగిన ఒలింపిక్ పోటీలో భారత హాకీ జట్టులో సభ్యులుగాఉన్నారు, ఈ జట్టులో ఒలింపిక్ అనుభవంగల ఆటగాళ్ళు మరికొంతమంది కూడా వున్నారు రోమ్‌కు వెళ్ళేముందు వారికి గట్టి తర్ఫీదు ఇవ్వబడింది ఒలింపిక్ పోటీలు జరిగేచోటుకు వారేముందుగా వచ్చారు. ఆటమైదానం ఎలా వుందోచూసి, అక్కడి పరిస్థితులకు అలవాటు పడడానికే వారు ముందుగా వెళ్ళారు.

రోమ్‌లో పాల్గొనే భారత ఫుట్‌బాల్ జట్టుకు పి. కె. లెనర్జీ నాయకులు ఆ జట్టు ఇంతకుముందు కలకత్తా, జకార్తాలలో ఇండోనీషియా జట్టును ఓడించి ఒలింపిక్ పోటీలో పాల్గొనడానికి అర్హత సంపాదించింది. ఆ జట్టులో అయిదుగురు సభ్యులు మెల్‌బోర్న్‌లో 1956లో జరిగిన ఒలింపిక్ ఫుట్‌బాల్ పోటీలో పాల్గొన్నారు. ఇందులో చాలామంది యువకులే. వీరిసగటువయస్సు 24 సంవత్సరాలు వారిలో అందరికంటే చిన్నవారు అరుణ్ ఘోష్‌కు యింకా 20 ఏండ్లుకూడా లేవు. ఈమధ్య భారతదేశంలో ఫుట్‌బాల్‌కు విశేష ప్రజాదరణ లభిస్తోంది, ఆట ప్రమాణాలు చెప్పుకోదగినంతగా పెరిగాయి.

అయిదుగురు సభ్యులతో కూడిన మల్లులబృందం, మరో రైఫిల్ షూటింగ్ బృందంకూడా ఒలింపిక్ పోటీలలో పాల్గొంటున్నాయి

మిల్ఖాసింగ్ కాక, యీ క్రింది పదిమంది వారిపేర్లప్రక్క వ్రాసిన పోటీలలో పాల్గొంటున్నారు

జోరాసింగ్, అజిత్‌సింగ్ (20 కిలోమీటర్లు, 50 కిలోమీటర్ల నడక) లాల్‌చంద్, జగ్మాల్‌సింగ్ (మరాతన్), జగ్‌మోహన్ సింగ్ (110 మీటర్ల హార

రేపటి నుండి:
లిబర్టీ- హైదరాబాదు నందు ప్రారంభము!
కమాల్ అమ్రోహిస్
దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయి
నేడు మాత్రమే!
రాయల్
హైదరాబాద్
నేడు 8 ఆటలు: 3-15, 6-15, 9-30
హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.
—శ్రీ సినీ కార్పొరేషన్ విడుదల
(Trupix)

4 వ సంయుక్త వారము.
శ్రీకృష్ణసాయి ఫిలిమ్స్ వారి
వీరజగ్గడు (తెలుగు)
కమల్
హైదరాబాద్.
చిత్రా
సికింద్రాబాద్.
ఆటలు: 6-00 మరియు 9-30 గం॥
హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.
మరియు లక్ష్మీ - వరంగల్.
26-8-60 నుండి:
శారద - మహబూబ్‌నగర్.
తీరంధాజ్ - కరీంనగర్.
తదుపరి మార్పు:
ప్రభాత్ - నిజామాబాద్.
నవాబ్ - ఖమ్మం.
—పూర్ణా విడుదల.

8 వ సంయుక్త వారము
పడుపువృత్తి నవ్వించు కమ్మని హాస్యరస చిత్రము.
హార్ట్ ఫిలిమ్స్
దేవాంతకుడు
(తెలుగు)
తా॥ ఎన్. టి. రామారావు, యస్. వి. రంగారావు, కృష్ణకుమారి.
దర్శకత్వం: సి. పుల్లయ్య.
దీపక్
హైదరాబాద్
మినర్వా
సికింద్రాబాద్
ఆటలు: 6-00, 9-30 గం॥
హెచ్చుతరగతులకు అడ్వాన్సుబుకింగ్
మరియుమార్కండేయ-వరంగల్
అశోక్ - నిజామాబాద్.
—ఈస్టు ఇండియా రిలీజ్.

నేడే చూడండి!
నీలా ప్రొడక్షన్స్ వారి
సి. ఐ. డి.
(తెలుగు)
తారాగణం:
ప్రేమ్‌నజీర్, బి. ఎస్. సరోజ, కుమారి.
జగత్ టాకీస్
సైదాబాద్ - హైదరాబాద్.
(Nima)

ఏడ్రయిన కార్యక్రమం

హైదరాబాద్-ఎ
405.4 మీ (740 కిలోసై)
శుక్రవారం, ఆగస్టు 26

ఉ॥ 6-30 సుప్రభాత్, కార్యక్రమ వివరణ6-40 భక్తిరంజని,(విజయవాడ నుండి 8లే) 7-00 తె-వా; 7-15 టి. వి. విశ్వనాథన్: వేణువు 7-40 గాంధీ కథ, 8-00 ఆం- వా, 8-15 హిం-వా; 8-30 హిందూస్థానీ సంగీత శిక్షణ: రాగ్‌కల్యాణ్, 8-45ప్రసారసమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము (విజయవాడనుండి 8లే) 1-00 శ్రీ సంసార్ (హిందీ) 1-30 ఎమ్. జె. రావు: సరస్వతీవీణ 1-50 తె-వా, 2-00 శాస్త్రీయ సంగీత్, 2-10 ఉ- వార్తలు, 2-20 హైద్రాబాద్ లిపలె 2-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానికప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 ఉర్దూ సంచిక 6-45 కవ్వాలి, 7-00 తె-వా 7-15 గాంధీకథ (ఉర్దూ) 7-30 కర్ణాటక సంగీత కచేరి, 9-00 ఆం- వా, 9-15 ఉర్దూలో వార్తలు, 9-30 చవితినాడు రూపకము, రచన: డి.వి. కృష్ణశాస్త్రి 7-45 సరళావాసుదేవ్: సుగమ్ సంగీత్ 10-00 ఎమ్. జె రావు: సరస్వతీ వీణ, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాదు-బి
49.06 మీ (6120 కిలోసై)
ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎవలె, 8-45 ప్రసార సమాప్తి.
30.96 మీ (9720 కిలోసై)
మ॥ 12-30 హైద్రాబాద్ ఎ వలె, 1-00 టి. వి. విశ్వనాథన్ 1-30, హైద్రాబాద్ ఎ వలె, 2-00 విశ్వనాథం: వీణ 2-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.
60.12 మీ (4990 కిలోసై)
సా॥ 6-00 హైద్రాబాద్ ఎ వలె, 6-15 గ్రామస్థుల కార్యక్రమం, గ్రామలక్ష్మి, స్త్రీల కార్యక్రమము, గణపతిపూజ రూపకము నీలాపనింద కథ వినాయకునిమీద పాటలు, ఊరి బావి ముచ్చటలు రంగుల రాట్నము పిల్లలకార్యక్రమము, వెంకయ్య, వెంకయ్యవేములుతాత రూపకము రచన: ఎస్. రాఘవరావు, ప్రకటనలు,ధరలు వాతావరణము 7-00 తె. వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, విశేషాలేమిటి? చేయంగల విన్నపాలు, 7-30 హైద్రాబాద్ ఎవలె, 9-00 ఆం. వా, 9-15 సంప్రదాయ సంగీం, సారంగపాణి కీర్తనలు 9-30 శ్రీ గణపతి, ముత్తుస్వామి దీక్షితులవారి షోడశ గణపతి కృతులతో కూర్చిన రూపకం, నిర్వహణ: విజయమూరి వరద రాజ అయ్యంగార్ 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ
857.1 మీ (840 కిలోసై)
ఉ॥ 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు, దేశభక్తిగేయం 6-40 భక్తి రంజని - గణేశ స్తుతి, 7-00 తె- వా, 7-15 హైదరాబాదు ఎ వ లె, 7-40 గాంధీకథ భజన్ (హైదరాబాద్‌నుండి 8లే), 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము పాటలు పండుగ చీర నాటిక, అతగండి చెప్తాము 1-00 గాత్ర సంగీతము, 1-30 లలిత సంగీతము, 1-50 తె- వా, 2-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె- వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 మద్రాస్ ఎవలె 9-00 ఆం. వా, 9-15 గణేశస్తుతి: నిలయవిద్యాంసులు, 9-30 హైద్రాబాద్ ఎ వలె, 9-45 గాత్రసంగీతము, 10-30 వాతావరణ సూచన ప్రసార సమాప్తి.

మాలటోవ్‌కు క్రొత్త ఉద్యోగం

విన్నా, ఆగస్టు 29
సోవియట్ మాజీ విదేశాంగమంత్రి మాలటోవ్ వియన్నాలోని అంతర్జాతీయ అణుశక్తి సంస్థలో సోవియటు ప్రతినిధిగా నియమింపబడినాడు

ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యోత్సవాలు

తుమ్మలపల్లి, వికారాబాదు

ఉదయము 6 గం॥ పాఠశాలవిద్యార్థులు మరియు పురప్రముఖులు కలసి గ్రామవీధులలో ఊరేగింపు తీసిన తరువాత పాఠశాల ఆవరణలో శ్రీయుత తిప్పయ్య ప్రధాన ఉపాధ్యాయులగారిచేపతాకావిష్కరణము చేయబడినది. విద్యార్థులకు మిఠాయి పంచిపెట్టబడినది.

మధ్యాహ్నము పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు జరుపబడినవి. సాయంత్రము 6 గం॥కు శ్రీయుత శరణప్ప సర్పంచుగారి అధ్యక్షతన బహిరంగసభ జరుపబడినది. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంచిపెట్టిరి. తరువాత పలువురు ప్రముఖులు 15వ ఆగస్టు ప్రాముఖ్యమునుగురించి ఉపన్యసించిరి చివరకు జాతీయగీతముతో ఈనాటి కార్యక్రమము ముగిసినది.

జనగామ

జనగామ లేబర్ యూనియన్ కార్యాలయములో యూనియన్ అధ్యక్షులు శ్రీ బుక్కా రంగయ్య గారు త్రివర్ణ పతాకను ఎగురవేసిరి. అనంతరం వివిధ వర్గాలకు చెందిన కూలీలు 2000 మంది లారీలు, టూరింగులలో జయజయ నినాదములతో గ్రామమంతయు ఊరేగింపుచేసిరి రాత్రి 9 గం॥కు కార్యాలయమ్ముందు శ్రీ జిడిగం రాజలింగయ్యగారి (మున్సిపల్ వైర్‌మన్) అధ్యక్షతన బహిరంగసభ జరిగినది. పంచాయితి సమితి ప్రెసిడెంట్ శ్రీ డి. నరహరి గారు యూనియన్ అధ్యక్షులు శ్రీ బి. రంగయ్యగారు యూనియన్ పరిధానకార్యదర్శి వి. రామమూర్తి గార్లు స్వాతంత్రోద్యమము, స్వాతంత్ర్య సిద్ధినిగూర్చి ఉపన్యసించిరి. బహిరంగసభకు 2 00 మంది ప్రజలువచ్చిరి తరువాత బీర్లకథ అను జానపద కథా కాలక్షేపము జరిగినది.

చిలుపూరు (వరంగల్)

ఎ. రాంచందర్ రావుగారు జండా వందనము గావించిరి. ఆటలపోటీలు తరువాత బహుమతులు పిల్లలకు యిప్పించబడినది. ఈసందర్భములో వందలాది ప్రజలు సభలో పాల్గొనిరి.

శ్రీ చెన్నకేశవస్వామి సంస్కృత పాఠశాల

పైపాఠశాలయందు చతుర్దశ స్వాతంత్ర్యదినోత్సవ సందర్భమున కార్యదర్శి శ్రీమాన్ యం. రామానుజాచార్యులవారు పతాకావిష్కరణ గావించి స్వాతంత్ర్య దిన ప్రాముఖ్యమును గూర్చి వుపన్యసించారు.

శ్రీ టి. నారాయణస్వామిగారు పాఠశాల ప్రధానోపాధ్యాయులైన శ్రీమాన్ శేషం వెంకటనరసింహాచార్యులవారు ఉపన్యసించినతరువాత శ్రీమాన్ యం. చెన్నకృష్ణగారి ధన్యవాదములతో నాటి కార్యక్రమము ముగిసినది.

జడ్చర్ల

స్థానిక బేసిక్ పాఠశాలలో ఉదయము గం॥ 6 1/2కు ప్రభాతఫేరి జరిగెను 8 గం॥కు స్థానిక పోలీస్ స్టేషన్‌కువెళ్ళిరి. అచ్చట శ్రీ మాధవ రెడ్డి ఎస్. ఐ. జండావందనము సలిపిరి తర్వాత అచ్చటినుండి శ్రీ డా॥ ఫ్రిజన్ అమెరికన్ హాస్పిటల్ కావరంపేట డైరక్టర్ మరియు శ్రీ డా॥ శ్యాంసన్‌గారు తదితర పుర ప్రముఖ వర్గము అందరునుకలసి బడికి విచ్చేసిరి.

శ్రీ రామేశ్వర్ రావు గ్రామపంచాయతి అధ్యక్షులు పతాకవందనము సలిపిరి. శ్రీ పి.పురుషోత్తము భారత స్వాతంత్ర్య సిద్ధిని గూర్చి వుపన్యసించిరి.

మధ్యాహ్నము ఆటలపోటీలు. సాంస్కృతిక ప్రదర్శనములు జరిగెను. సాయంకాలము బహిరంగసభలో శ్రీ వెంకటరావుగారిచే బహుమతులు యిప్పించబడెను. తర్వాత బాలురకు మిఠాయి పంచబడెను.

రామయ్యగూడెం (వికారాబాదు)

స్థానిక ప్రాథమిక పాఠశాలలలో ఉదయము ప్రభాతఫేరి జరిగినది. ఆ తర్వాత శ్రీ జి. నారాయణ ప్రధానోపాధ్యాయులవారిచే జండావందనము జరుపబడినది. ఇందులో గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొనినారు విద్యార్థులకు గ్రామ బాలబాలికలకు పాలు తినుబండారములు పంచబడినది. బహిరంగసభ జరిగినది. అందులో శ్రీయుత ఎం. వీరమల్లప్ప సమితి అధ్యక్షులుగారు, బి. డి. ఓ. గారు, సూపర్ వైజర్, విశ్వనాథం గారు హెచ్. వి. నర్సయ్య కాంగ్రెస్ కమిటి కార్యదర్శి తాలుకా వికారాబాదు లక్ష్మీకాంతరెడ్డి, లంకాల లక్ష్మారెడ్డి లంకాలఆనంతరెడ్డి మొదలైన ప్రముఖులు పాల్గొనిరి గం॥ 11-15లకు శ్రీ కె. రాములుగారిచే పాఠశాల భవనమునకు శంకుస్థానజరుపబడినది

పాతపాళెం (తా॥ గద్వాల)

ఉదయము కేంద్ర ప్రా. పాఠశాల విద్యార్థి బృందముతో ప్రభాత ఫేరి జరుపబడెను.

పంచాయతీ ఆవరణలో శ్రీచంద్రశేఖరయ్య సర్పంచుగారు ఝండావందనముచేసిరి. శ్రీటి. రాములు ప్రధానోపాధ్యాయులు ప్రసంగించిరి.

హరిజనవాడలో 50 గజాల మురుగు కాలువను యువజన సంఘం వారు మరియు పంచాయతీ సభ్యులు శ్రమదానముతో శుభ్రపరచిరి.

శ్రీయుత బి. డి. ఓ. గద్వాలగారి అధ్యక్షతన పాఠశాల బాలబాలికలకు ఆటల పోటీలు జరిపి గెలుపొందిన వారికి బహుమతులు యివ్వబడెను.

శ్రీయుత మెడికల్ ఆఫీసర్ గద్వాలగారి అధ్యక్షతన పిల్లల ప్రదర్శనము జరిగినది ఆరోగ్యముగా ఉన్న పిల్లలకు సమితి ఉపాధ్యక్షులు బహుమతులు పంచిరి,

బుధారం

స్థానిక కాంగ్రెసు కార్యకర్తలు పంచాయతీ సభ్యులు పాఠశాల ఉపాధ్యాయులు బాలబాలికలు ప్రజలు బాజభజంత్రీలతో జాతీయ ఝండాలను తీసుకొని నాలుగు బజారులలో ఊరేగింపు తరువాత గ్రామము నడిబజారులో శ్రీ ఇంద్ర సేనారెడ్డి అధ్యక్షులవారిచే పతాక వందనము జరుపబడినది

కన్నాల

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భమున ఉదయము 6-00 గంటలకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, పంచాయతీకమిటీ సభ్యులు, విద్యాకమిటి సభ్యులు, సహకార సంఘ సభ్యులు మరియు గ్రామీణులు బాజభజంత్రీలతో జాతీయగీతములు పాడుచూ, దేశనాయకుల జైజై నినాదములతో గొప్ప ఊరేగింపుతో బయలుదేరి పాఠశాల ఆవరణలోను పంచాయతీ కమిటీ కార్యాలయములోను శ్రీ విక్షిష్టయ్య ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యమున శ్రీ యం. రామిరెడ్డి (పంచాయతీకమిటీ అధ్యక్షులు)చే పతాక వందనముజరుపబడినది. తదుపరి బాలబాలికలకు మిఠాయి పంచబడి ఆటల పోటీలు జరుపబడెను. సాయంత్రము బహిరంగసభ ఏర్పరచబడెను. శ్రీ పధానోపాధ్యాయులవారు శ్రీఎం. రాంరెడ్డి (అధ్యక్షులు) శ్రీ ఎం ముకుందారెడ్డి (మాజీ అధ్యక్షులు). ఎం. బుచ్చిరెడ్డి (కార్యదర్శి) ఉపన్యసించిరి. తదుపరి ఆటల పోటీలలో నెగ్గిన వారికి అధ్యక్షులవారిచే బహుమతులు పంచబడెను. తేనీటి విందుతో సభ ముగింపబడెను.

చెన్నూరు (తా॥ జనగామ)

గ్రామ పాఠశాల మరియు పంచాయతీబోర్డుల ఆధ్వర్యమున ఉదయము 5 గంటలకు ప్రభాతఫేరి జరిగినది. పాఠశాల ఆవరణములో 8-30 గంటలకు శ్రీనర్సింహులుగారిచే పతాకము ఎగుర వేయబడెను. బాలురు మరియు పంచాయతీబోర్డు మెంబర్లు కలిసి ఊరేగింపుతో పంచాయతీ కార్యాలయమునకు వెళ్ళిరి అక్కడ శ్రీఎన్. సంపత్ రావుగారిచే పతాకము ఎగుర వేయబడెను. ఉదయము 10 గంటలకు పాఠశాల ఆవరణములో బాలుర ఆటల పోటీలు జరిగెను. మధ్యాహ్నము 2-30 లకు యువజన సంఘము ఆధ్వర్యమున యువకులకు ఆటల పోటీలు జరిగెను.అందులో గెలుపొందినవారికి సాయంత్రము 7.0 గంటలకు బాలురకు బహుమతులు పంచబడెను యువకులకు శ్రీ పెండ్యాల కిషన్‌రావు గారిచే బహుమతులు పంచబడెను తర్వాత పాఠశాల బాలురచేత "వెర్రి గారాము" అనే నాటిక ప్రదర్శింపబడెను. తదుపరి శ్రీ కె. దుర్గయ్య (ఉపసర్ పంచ్)గారి కృతజ్ఞతాభివందనములతో సభ ముగిసినది.

జగిత్యాల

పాఠశాల విద్యార్థులు ఉదయము 6-30 నుండి గ్రామములో బ్యాండు యుక్తముగా ప్రభాత ఫేరిని జరిపినారు. పిదప 8 గంటలకు పాఠశాలముందు జయజయ ధ్వనులతో మిన్నుముట్టగా ప్రధానోపాధ్యాయులవారగు శ్రీ యం. నారాయణరెడ్డి గారు పతాక ఆవిష్కరణ గావించిరి. తర్వాత ఉపన్యాసములు జరిగినవి పిదప విద్యార్థులందరికి మిఠాయి, మరియు నాయకపువారికి హరిజనులకు సమాజము తరపునుండి కొంతమంది పిల్లలకు అంగీలు, నిక్కర్లు ఇవ్వబడినవి.

10 గంటలనుండి విద్యార్థులందరికి వివిధమయిన ఆటలపోటీలు జరిగినవి. వాటిలో గెలుపొందిన వారికి పాఠశాల సభ్యుడయిన శ్రీ మట్ల రాజిరెడ్డిగారు బహుమానములు ఇచ్చినారు.

పోచంపల్లి

నల్లగొండ జిల్లాలోని భువనగిరి పంచాయతీ సమితికెందిన పోచంపల్లి గ్రామంలో పదునాలుగవ స్వాతంత్ర్య దినోత్సవము మహావైభవముగా జరుపుకొనబడినది. ప్రాతఃకాలమున స్థానిక పాఠశాలనుండి ప్రభాతఫేరి తీయనయినది. గ్రామములోని ముఖ్య స్థలాలలో ఉదయం 7-30 గంటలకు పతాకములు ఎగురవేయబడినవి. పాఠశాల విద్యార్థుల మరియు గ్రామస్థుల ఆటలపోటీలు జరుపబడినవి సాయంకాలము పాఠశాల ఆవరణలో బహిరంగసభ శ్రీయుత సింహాచలం గారి అధ్యక్షతన జరుపబడినది. శ్రీయుతులు యం. నారాయణరెడ్డి (గ్రామసేవకు), సిద్ధేశ్వర్, పి. సత్యనారాయణరావుగారలుఉపన్యసించిరి తదుపరి ఆటలపోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు పంచబడినవి. రాత్రి సాంస్కృతిక కార్యక్రమములు జరుపబడినవి.

నల్లగొండ

జిల్లా వెనుకబడిన తరగతుల సంఘ అధ్యక్షులు శ్రీ పుల్లెముల వెంకటులు. గీత పారిశ్రామిక సహకార సంఘ ఉపాధ్యక్షులుగారు నల్లగొండ చౌరస్తాలో జాతీయ జండాను ఎగురవేసినారు. శ్రీ కె. రామకృష్ణారెడ్డి జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు సి. హెచ్. శంకర్‌రావు జిల్లా కాంగ్రెసు ఉపాధ్యక్షులు, చాడ గోపాల్ రెడ్డి జిల్లా కాంగ్రెసు కార్యదర్శి, నల్లగొండ మండల కాంగ్రెసుఅధ్యక్షులు, మందాడపు శంకరయ్య మండల కాంగ్రెసు కార్యదర్శి, డా॥ కె. రంగనాయకులు, శ్రీ డా॥ బి సుదర్శన్ రావు, జి.వి.బ తరగతుల సంఘ అధ్యక్షులు, డా॥ పి. లింగయ్య, ఉపాధ్యక్షులు. బి. అర్జున్,కార్యదర్శి గుంటి రాములు, యస్ - జి కాశయ్య, గంజి మల్లయ్య యితర సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు అధికారులు ఈ ఉత్సవములో పాల్గొన్నారు

శ్రీ డా॥ యం. వి. గుప్త గారు జాతీయగీతం పాడారు.

కాకినాడ

చతుర్దశ భారతస్వాతంత్ర్య దివసోత్సవాన్ని ఆంధ్ర కళా పరిషత్తువారి యాజమాన్యమున, తిలక్ వీధిలోని పరిషత్ కార్యాలయమునందు సూత్రయజ్ఞాది గాంధేయ సూత్రాను సరణముగ, అతిశోభాయమానముగ జరుపుకొనిరి పరిషత్ ప్రధాన కార్యదర్శి రమణశ్రీ పతాకప్రతిష్ఠ సల్పిరి. పూజ్యజాపూజీవిగ్రహమునకుపుష్పాంజలి వేద పఠనంతో గావింపబడింది కుమారి ఆదిత్య సౌభాగ్యలక్ష్మిచే భగవద్గీతాపఠనం, బులుసు యజ్ఞగారిచే పురాణ ప్రవచనం గావింపబడినవి. అనంతరం బాలబాలికలకు మిఠాయి పంచిపెట్టిరి. సాహిత్య సమారాధన సాయంకాలం జరిగింది. శ్రీ ఉప్పాడ రాజారావు.రమణశ్రీ,శ్రీజి జె.శామ్యుయెల్ కవి,పరిషత్ సభ్యులు, పండితులు కవులు పాల్గొనిరి. "ధ్వజాంజలి" "జయ పతాక" "స్వాతంత్ర్య దినోత్సవానుశీలనము" అను శీర్షికలపై శ్రీ రాజారావు, రమణశ్రీ, శామ్యుయెల్ కవిగార్లు తామురచించిన పద్యములను సభలో పఠించిరి. పలువురు ప్రముఖులు భారతస్వాతంత్ర్య సమర పరిశీలనపై ప్రసంగించిరి. పరిషత్ మహిళాసదస్యలచే గానముచేయబడిన "జనగణమన" స్వస్తిగేయంతో సాహిత్య సమారాధన పరిసమాప్తమయినది.

పాలిబండి (హైదరాబాదు)

ఉదయము 8 గంటలకు శ్రీయుత బి మాణిక్యం (మున్సిపల్ కౌన్సిలర్) గారిచే జాతీయపతాకము ఎగురవేయబడెను. తదనంతరము పిల్లలకు మిఠాయి పంచిపెట్టబడెను. సాయంత్రము 8 గంటలకు శ్రీ యుత మాణిక్యం గారి అధ్యక్షతన బహిరంగసభలో ఆటలపోటీలలో గెలుపొందిన బాలురకు బహుమతులు యీయబడినవి తర్వాత శ్రీ యం. ఆర్. స్వామి (కార్యదర్శి) బాలసంఘవాచనాలయము నివేదిక సమర్పించిరి. శ్రీయుత మనోహరరాజ్ సప్సేన, శ్రీయుత విశ్వనాథ్‌రావు బి. ఎ. శ్రీ యుత మహబూబ్ నారాయణ గార్లు ఉపన్యసించిరి.

భువనగిరి

భువనగిరి పురజనులందరు అనితైభవోపేతముగా తమతమవాడల త్రివర్ణతోరణములతో అలంకరించుకొని, ప్రభుత్వ కార్యాలయముపై తమతమ భవనాలపై జాతీయజండాలను ఎగురవేసిరి. భువనగిరి మండల కాంగ్రెసు కార్యాలయ భవనముపై పాదరాజు హన్మంతరావుగారు జండా వందనము జరిపిరి. జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు హమాలీ సంఘమువారి ఆధ్వర్యమున 801 మంది బీదలకు గాంధీపార్కులో అన్నదానము జరిగినది. బహిరంగ సభలో శ్రీ పాదరాజు హనుమంతరావు, డి, లక్ష్యయ్య, టి. లక్ష్మారెడ్డిగార్లు ఉపన్యసించిరి.

భువనగిరి ఉన్నత పాఠశాలలో సభకు శ్రీడిప్యూటీకలెక్టరుగారు అధ్యక్షతవహించిరి. విద్యార్థుల ఎ. సి సి స్కౌట్ వందనములతో సభప్రారంభమైనది. ప్రధాన ఉపాధ్యాయుడు ఉపన్యసించిన తరువాత సభ ముగిసినది.

మంథాల (ఇబ్రాహింపట్నము)

పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదయము ప్రభాతఫేరి, జాతీయ గీతములు మరియు నినాదములతో ఊరేగినతరువాత పాఠశాల ఆవరణలో ఉదయం 8-30 గంటలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులగు శ్రీ ఐ. దివాకరరెడ్డిగారు జాతీయ త్రివర్ణ పతాకము ఎగురవేసిరి. అనంతరం గ్రామసర్పంచ్ శ్రీనివాసరెడ్డి గారి అధ్యక్షతన సభ జరుపబడెను పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టబడెను

అదేరోజు గ్రామ ప్రముఖులు, ప్రజలు అందరు కలిసి శ్రీ వెంకట నారాయణరావు గారి ఆధ్వర్యమున గ్రామ పునరుద్ధరణ సంఘము స్థాపించుటకునిశ్చయించి అధ్యక్షులుగా శ్రీ శ్రీనివాస రెడ్డి గారిని, ఉపాధ్యక్షుడుగా శ్రీసాంబశివరెడ్డిగారిని, కార్యదర్శిగా శ్రీ పి. ప్రతాపరెడ్డిగారిని మరియు కోశాధ్యక్షునిగా శ్రీ అగిద బుచ్చయ్య గుప్తగారిని ఎన్నుకొనిరి.

యల్లారెడ్డిగూడ (నల్లగొండ)

గ్రామ పంచాయతివారు మండల కాంగ్రెసువారు, గ్రామ కాంగ్రెసువారు, పాఠశాలవారలు గ్రామప్రజలు కలిసి బాజభజంత్రీలతో జాతీయ పతాకము దీసికొని నాల్గు బజారులు తిరిగిన తరువరి పాఠశాలవద్ద శ్రీరాజరత్నం (ప్రధానోపాధ్యాయులు) పంచాయతి ఆఫీసువద్ద శ్రీ బి నారాయణరావు గారు (అధ్యక్షులు) కాంగ్రెసు ఆఫీసు వద్ద శ్రీ ఆర్. రాఘవరెడ్డి. (అధ్యక్షులు) జండాలను ఎగురవేసినారు. పగలు విద్యార్థుల ఆటలు పోటీలుజరుపబడినవి

లింగోజీగూడ (సరూరునగరు)

భారత స్వాతంత్ర్య దినోత్సవము హైద్రాబాద్ తూర్పుతాలూకాలోని లింగోజీగూడ, సరూర్‌నగర్ గ్రామాలలో వైభవోపేతంగా జరుపుకోబడింది. ఉదయం లింగోజీగూడలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే ప్రభాత ఫేరి ఊరేగింపు తీయబడింది పాఠశాల ఆవరణలో జాతీయపతాకం ఎగురవేయబడింది. ఆటల పోటీలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ గ్రామంలోని గాంధీ విగ్రహం దగ్గర శ్రీ ఎస్. అమృతలాల్ జండాను ఎగురవేశారు సాయంత్రం అక్కడ జరిగిన బహిరంగ సభకు లింగోజీగూడ సర్‌పంచ్ శ్రీ మద్దూరు కామేశ్వరరావు అధ్యక్షత వహించారు. హయత్‌నగర్ పంచాయతీ సమితి ఉపాధ్యక్షుడు శ్రీ టి. రామయ్యగుప్త, శ్రీ ఎస్. కుందన్ లాల్ తృతీయ పంచవర్ష ప్రణాళిక ప్రాధాన్యాన్ని వివరించారు.

శ్రీ మద్దూరు కామేశ్వరరావు ఆటలు పోటీలో గెలుపొందినవారికి బహుమతుల్ని పంచిపెడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేసినందుకు సమితివారిని అభినందించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగల విద్యార్థులకు తగు విధంగా విద్యాబోధనచేయుటకు ఉపాధ్యాయులంతా గ్రామంలో నే కాపుర ముండాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీ టి. రామయ్య గుప్త వందన సమర్పణలతో సభ ముగించబడింది.

వాడుకభాషావారాలు

మెసర్స్ కల్వ సూర్యనారాయణ మర్చంట్ అండ్ కమీషన్ ఏజంట్
ఉస్మాన్‌గంజ్ - హైద్రాబాదు
ఫోన్ నెం. 4412

హైద్రాబాద్, ఆగస్టు 24
(పల్లా ఒక్కంటికి 120 తేర్లు)

నానకరాలు	68-0-0 72-0-0
గర్కులు	59-0-0 61-0-0
పాలకుర్లు	65-0-0 67-8-0
24 నంబర్లు	74-0-0 75-0-0
బంగారుతీగెలు	72-0-0 76-0-0
గుజ్జులు	68-8-0 71-8-0
గొట్టె బియ్యం	57-0-0 59-8-0
కుసుమబియ్యం	64-0-0 66-0-0
దొడ్డు బియ్యం	61-0-0 64-0-0
సెంబరు సా॥	64-0-0 67-0-0
సాంబర్లు పా॥	
కొత్తసాంబర్లు	78-0-0 80-0-0
నూకలు	42-0-0 50-0-0
బన్నిగోధుమలు	72-0-0 76-0-0
కుస్మలు	65-0-0 66-8-0
కందులుపెద్దవి కొ॥	52-0-0 55 0-0
కందులుచిన్నవి కొ॥	45-0-0 51-0-0
మినుములు	52-0-0 58 0-0
పెసలు	49-0-0 50-0-0
శెల్లం	54-0-0 63-0-0
పెసర్లు కొ॥	52-0-0 56 0-0
తెల్లజొన్నలు	49-0-0 51-0-0
పచ్చజొన్నలు	45-0-0 46-8-0
మిరపకాయలు	220-0-0 260-0-0
నువ్వు	116-0-0 128-0 0
ఉల్లిగడ్డ కొ॥	11-0-0 15-0-0
చింతపండు కొ॥	70-0-0 115-0-0
నల్లవుప్పులు	41-0-0 41-8-0
తెల్లనువ్వులు	180-0-0 185-0-0
సద్దలు	53-0-0 53-8-0
పెద్ద కందిపప్పు	76-0-0 80-0-0
చిన్న కందిపప్పు	64-0-0 68 0-0
శెనగపప్పు	56-0-0 60-0-0
పెసరపప్పు	72-0-0 75-0-0
మినుపపప్పు	74-0-0 76-0-0
ఆముదాలు	70-0-0 70-8-0
లంకపిండి	49-8-0 51-0-0
ఇలాతికాయ చి॥	84-0-0 84-8-0
యెర్రనువ్వులు	140-0-0 145-0-0
యెగబొల్కర్లు	52-0-0 54-0-0
(12 శేర్ల మణుగు)	
ఆల్లం	12-0-0 12-8-0
యెల్లిగడ్డ	4-0-0 5-8-0
వల్కునూనె	22-0-0 22-0-0
ఆలుగడ్డ	4-8-0 5-0-0
(16 శేర్ల మణుగు)	
ధనియాలు	16-0-0 19-0-0

ఈప్రకారము యీరోజు అయిన ధరలు వ్రాయించాము. గిట్టినవరుకులు పంపవచ్చును. తెప్పించుకో వచ్చును.

"కోకనాడ" పేరు "కాకినాడ"గా మార్పు

న్యూఢిల్లీ, ఆగస్టు 24
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సూచన ప్రకారం కోకనాడ రైల్వేస్టేషను పేరును కాకినాడ రైల్వే స్టేషను అని మార్చడానికి రైల్వేశాఖ అంగీకరించినదనీ, అమార్పు చేయడానికి ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం వద్దనుంచి వర్తమానం కోసం ఎదురుచూస్తున్నదనీ కేంద్ర రైల్వే ఉపమంత్రి శ్రీ ఎస్ వి. రామస్వామి లోకసభలో శ్రీ మధుసూదన రావు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో తెలియజేశారు.

కాంగోసంప్రదింపుల సంఘం

న్యూయార్క్, ఆగస్టు 24
కాంగో సమస్యలో ఐక్య రాజ్య సమితి ఉన్నత కార్యదర్శికి సహాయభూతంగా సంప్రదింపుల సంఘంగా ఉండేందుకు యిరుగువ రాజ్యాలతో ఒకసంఘం ఏర్పాటైనట్లు తెలుస్తున్నది.

ఇండియా,ఇండోనీషియా,ఘానా, ఐక్య అరబ్ రిపబ్లిక్, కెనడా, ఇథోపియా, గినియా, బెల్జియం, లైబేరియా, మాలి ఫెడరేషన్,మొరాక్కో, పాకిస్తాన్, సూడాన్, స్వీడన్, టునీషియా.

కృష్ణాజిల్లా ప్రజాపార్టీసమావేశం

విజయవాడ, ఆగస్టు 24
కృష్ణాజిల్లా ప్రజా పార్టీ సమావేశం ఆగస్టు 31 వ తేదీ ఉదయం 8½ గంటలకు విజయవాడ శ్రీరామ మోహన గ్రంథాలయంలో జరుగుతుంది ఆంధ్ర ప్రజాపార్టీ అధ్యక్షుడు శ్రీ తెన్నేటి విశ్వనాథం సమావేశాన్ని ప్రారంభిస్తారు. ప్రధాన కార్యదర్శి డా॥ ఎ. వి. నాగేశ్వరరావు. (ఎం. ఎల్. ఏ) శ్రీ ఎస్. కె. వి. కృష్ణావతారము, (ఎం. ఎల్. ఏ). శ్రీ వేకేటి తమ్మిరాజు, (ఎం ఎల్. ఎల్.) ప్రభృతులు పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు అదేచోటజరిగే బహిరంగసభలో శ్రీ విశ్వనాథం ప్రజల్ని ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తన్నివారణోపాయముల గురించి ప్రసంగిస్తారు

సబార్డినేటు శాసన నిర్మాణ సంఘం

(1960 - 61) సమావేశాలు, శాసన సభా భవనాలలోని కమిటీ గదిలో సెప్టెంబరు 1, 2 తేదీలలో సాయంత్రం 3 గంటలకూ, 3వ తేదిన ఉదయం 11 గంటలక

ప్రేక్షకుల కోరికపై నేడు 6-30 నుండి ప్రారంభం

ఫిలిమ్‌ఆయాన్ & ఎస్. ముఖర్జీ వారి

* దిల్ దేకె దేఖో *

తా: షమ్మీకపూర్, ఆషాఖాన్, ముంతాజ్ అలీ.

దర్శకత్వం: నసీర్ హుసేన్. సంగీతం: మిస్ ఉషాఖన్న.

అశోక్ - హైదరాబాద్.

ఆటలు: 6-30 మరియు 9-30.

హెచ్చుతరగతులకు అడ్వాన్సు బుకింగ్.

(Trupix.) —చిత్రకళా పిక్చర్స్ విడుదల.

రేపే ప్రారంభము!

ఉత్తమ నటవర్గముతో అత్యద్భుత విషాద చిత్రము.

వెండితెర నలంకరించుచున్నది.

బిమల్ రాయ్ ప్రొడక్షన్స్: పరఖ్

తా: సాధన, వసంతచౌదరీ, మోతీలాల్ వగైరా.

దర్శకత్వం: బిమల్ రాయ్, సంగీతం- కథ: సలీల్ చౌదరి.

దిల్ షాద్ హైదరాబాద్ — మినర్వా సికింద్రాబాద్

శుక్ర, శని, ఆది 4 ఆటలు: 12-30, 3-30, 6-30, 9-30 గం॥ శుక్ర, శని, ఆది 3 ఆటలు: 3-30, 6-30 మరియు 9-30.

పై తరగతులకు అడ్వాన్సు బుకింగ్ కలదు.

నిజామ్ మరియు ఆంధ్రకు డిస్ట్రిబ్యూటర్లు:- —రషీద్ మెహతా & కంపెనీ

(Nima)

వినాయకచవితి పండుగకు

రేపే ఆంధ్రప్రదేశ్ అంతటా విడుదల

"శాంతి నివాసం" నిర్మాత లలచేమరొక మహత్తర సాంఘిక చిత్రము.

శ్రీ ప్రొడక్షన్ వారి

అభిమానమ్ (తెలుగు)

తా: నాగేశ్వరరావు, వాణిశ్రీ, రేలంగి, జి. వి. ఎస్. శర్మ, రమణాచలమ్, నల్లరామమూర్తి, అల్లురామలింగయ్య, సావిత్రి, కన్నాంబ, కృష్ణకుమారి, ఎస్. వరలక్ష్మి వగైరా.

దర్శకత్వం: సి. ఎస్. రావు. సంగీతము: ఘంటసాల.

కమల్-హైదరాబాదు అలంకార్-సికిందరాబాదు

రోజూ 3 ఆటలు: 2-3, 6-00, 9-30.

రామా-వరంగల్ రమేష్-నిజామాబాద్

హెచ్చు తరగతులకు అడ్వాన్స్ బుకింగ్.

(Nima) —రాజశ్రీ విడుదల.

ఆంజనేయ దేవాలయమునకు శంకుస్థాపన

హైదరాబాద్, ఆగస్టు 24

"వినాయక చవితి" సందర్భమున "భారత సేవాశ్రమ సంఘం" శివనగర్ (దోమలగూడ) ఆవరణలో ఆగస్టు 26 వ తేదీ సాయంత్రం 6 గంటలకు జరిగే సభలో సహకారమంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి ఆంజనేయ దేవాలయమునకు శంకుస్థాపన గావించెదరు.

జనసంఘ సభల్లో అస్సాం సమస్య

కలకత్తా, ఆగస్టు 24

హైదరాబాద్‌లో యీ నెల 25, 26 తేదీల్లో జరిగే భారతీయ జనసంఘ అఖిల భారత కార్యవర్గ సమావేశంలోను, 27, 28 తేదీల్లో జరిగే ప్రతినిధి సభలోను అస్సాం సమస్య ప్రధానంగా చర్చకు రాగలదట. ఈ సభల్లో పాల్గొనేందుకు పశ్చిమ బెంగాల్ జనసంఘ అధ్యక్షుడు శ్రీ దేవప్రసాద్ ఘోష్ నేడు హైదరాబాద్‌కు బయలుదేరారు.

వెండి బంగారు ధరలు

సముద్రాల రాఘవులు గారి చంద్రయ్య దుకాణం

సిద్దంబర్ బజార్, ఫోన్ నెం. 4890

హైదరాబాద్, ఆగస్టు 23

బంగారం	182-4-0
ఆలోక్ చిఫ్	182-8-0
నవరత్	88-0-0
వెండి 100 తు॥	228-0-0
చిల్లర	2-4-0

1960 వ సం॥పు మోటారు శకటాల (సవరణ) చట్టం జూలై 15వ తేదీనుంచి అమల్లోనికి వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

న్యూయార్కు ప్రత్తి

న్యూయార్కు	ఆగసు	23
ప్రారంభం	30'	96
ముగింపు	30·	98

6 వ విజయవంతమైన సంయుక్త వారం!

పక్షిరాజా వారి

ఇ విమల

సాగర్ అజంతా

2 ఆటలు: 6-00, 9-30

రాజరాజేశ్వరి-వరంగల్

ఉన్నత తరగతులకు ఎడ్వాన్స్ బుకింగ్ కలదు.

—ఛత్రియా రిలీజ్.

(Trupix)

జీవిత ప్రమాణాలకన్న విలువలు పెరగడం ముఖ్యం

గుంటూరులో మంత్రి శ్రీచంద్రమౌళి ఉద్ఘాటన

(స్వ వి)

గుంటూరు, ఆగస్టు 24

"ధర్మంవిడిచి అర్థకామాల కోసం ప్రాకులాడటం తగదు. అది నిరర్థకం. ధర్మరహితమైన జీవితం చెప్పుకోదగినదిగాదు. జీవితప్రమాణాలు పెరగటం గాదు ఈనాడు కావల్సింది. జీవితపు విలువలు పెరగాలి" అందుకే నిరంతర కృషి జరగాలి. ప్రవర్తనను బట్టిగాని రూపాయలను బట్టి గాదు జీవితాన్ని పరిగణించటం. ప్రకృతి, నీతిబద్ధంగా, నియమబద్ధంగా సంచరిస్తుంటే ప్రపంచానికి శాంతి సందేశాన్ని వినిపించే మానవుడు నీతిబద్ధంగా, నియమబద్ధంగా, నిగ్రహంతో జీవితాన్ని గడపలేకపోతే ఎలా?" అని. దేవాదాయ శాఖామంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి స్థానికపట్టాభిపురం కాలనీలో నెల కొల్పబడిన శ్రీరామసత్యనారాయణ స్వామివారి దేవాలయాన్ని తెరుస్తున్న సందర్భంలో మాట్లాడుతూ అన్నారు.

శ్రీ తెల్లాకుల జాలయ్య (ఎం ఎల్. ఏ) సభాధ్యక్షతవహించారు గుంటూరు సహకార భవన నిర్మాణ సంఘ అధ్యక్షులు, సభ్యులు, భద్రాద్రి దేవాలయోద్ధరణనిధికిగాను రు.200 మంత్రికి సమర్పించారు. శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో గతకొన్ని నెలలుగా రామాయణకాలక్షేపాన్ని కొనసాగిస్తున్న శ్రీ వారిహనుమచ్ఛాస్త్రికి, పట్టాభిపురంకాలనీ ప్రజల తరపున మంత్రిచేత రు.202రొక్కం సమర్పింపబడినది. అనంతరం సంఘాధ్యక్షులు శ్రీ చావలి సూర్యనారాయణ విజ్ఞాపనపత్రాన్ని సమర్పించారు. ఈదేవాలయాన్ని ప్రభుత్వ దేవాదాయశాఖవారు తీసికొని, అభివృద్ధికి తీసికొని రావాలని ఒకసూచన ఇందులో చేయబడినది.

సభాధ్యక్షులు మాట్లాడుతూ, ఈకాలనీలో 200పైగా గృహాలు కలవనీ, ఒక్కొక్కఇంటివాడు రు. 50 చొప్పున ఇస్తే ఈ దేవాలయానికి చక్కని ఆదాయం ఏర్పడగలదనే భావాన్ని వ్యక్తంచేశారు.

మంత్రి శ్రీచంద్రమౌళి మాట్లాడుతూ, ఈదేవాలయంమీద ఎవరికీ హక్కుగల్గియుండరాదనీ. ఇది ప్రజల దేవాలయమనీ, ప్రజలే ముందుకు వచ్చి సహకరిస్తే అన్నవరం సత్యనారాయణ స్వామి దేవాలయంవలె అత్యున్నత స్థాయికి రాగలదనీ అన్నారు.

భద్రాద్రి దేవాలయ పునర్నిర్మాణము విషయంలో చెలరేగుతున్న గాలి దుమారం గూర్చి చెబుతూ, తా మెన్నడూ మూల విరాట్టులను తొలగిస్తామని అనలేదనీ. ఏదయినప్పటికీ పత్రికలు సరిఅయిన ప్రచారం చేయాలనీ అన్నారు.

భౌతిక, ఆధ్యాత్మిక వాదాలకు, బాహ్య, అంతస్సౌందర్యాలకు, సమన్వయాన్ని సాధించగల్గాలనీ. భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించాలనీ, ఆర్ష ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని తుచ్ఛంగా తెలిసికోవాలనీ, సంస్కృత విద్యను, శాస్త్రాన్ని, వైదిక విజ్ఞానాన్ని అలవరచుకోవలసిన అవసరం ఎంతైనా యున్నదనీ మంత్రి ఉద్ఘాటించారు.

మానవుడు పశువుగాగాక, మానవుడుగా, దైవసమానుడుగా ప్రవర్తించాలనీ, మానవత్వంనుంచి దైవత్వాన్ని అందుకోగల్గినపుడే, ఒకరిని సంస్కరించచూడటంగాకతనకుతాను సంస్కరించుకొనగల్గినపుడె ఈ విశ్వానికి ఎంతో మేలుచేసినవారవుతారని ప్రతి ఒక్కరు గుర్తించాలనీ అన్నారు.

శ్రీ ఎం. నరసింహారావు వందన సమర్పణ గావించారు.

పశుగ్రాసంగా ఎండుతున్న వరినార్లు!

అదోల్ తాలూకాలో

నీటి కడవ నాల్గణాలు కూడా!!

(స్వ.వి)

జోగిపేట, ఆగస్టు 24

అందోలు తాలూకాలోని సంటల స్థితి అతి అధ్వాన్నంగావుంది. మృగశిరకార్తెలో కొన్ని జల్లులుపడినవికాని భూమి ఆవర్షానికి నానలేదు. వర్షబుతువు ఆరంభం మొదలు నేటివరకు పంటల కనుగుణమగు వర్షం వర్షించలేదు. వేరుసెనగ, రాగి, మొదలగు పంటలు ఎండిపోవుచున్నవి. మినుము, పెసరలకు కొంచెమైనా వర్షంపడితే లాభముండెడిదికాని ఆకొంచెం వర్షమైనాలేదు ఇక వరినార్లమాటచెప్పనే అక్కరలేదు ఆనార్లు చివరకు పశువులను మేపుతున్నారు! మార్కెటుకు బియ్యం జొన్నలు రావడంలేదు కొన్ని వచ్చినా ధరలు ఆకాశాన్నంటుచున్నవి. పూర్తిగా నాసిరకం బియ్యము ధర రు. 70 నుంచి బియ్యంధర 85 ఉంది. ఆహారకొరత ఈవిధంగా వుండంటే మంచినీటి కొరత గూడా ఏర్పడుచున్నది. ఈపెద్దగ్రామంకు వుండబడిన రెండే రెండు మంచినీటిబావులు ఇంచుమించు ఎండిపోయేస్థితి వస్తున్నది. నాల్గణాలకొక కడవనీరు కొనుక్కొంటున్నారు. ఒక్క వరిగడ్డి మోపు సుమారు రెండు రూపాయలు చెప్పుచున్నారు. కాన ఈపరిస్థితులను ప్రభుత్వంవారు శ్రద్ధగా పరిశీలించి అందోలు తాలూకాను ఆహారకొరతప్రాంతంగా ప్రకటించి, భూముల శిస్తును మాఫీచేసి అక్కడక్కడ చౌకధాన్యడిపోలుతెరచి ఆహారకొరతను తీర్చవలెనని ప్రజలు కోరుచున్నారు. ప్రతి బీదకుటుంబానికి ఏదైనా పని కల్పించేపర్పాట్లుజరగాలి. ఈ తాలూకాలో ఏ ప్రాజెక్టు గాని రిజర్వాయర్ గాని లేనివిషయం కూడా గమనించబడాలి.

శ్రీ గజానన మహోత్సవ సందరంలో శ్రీ మహారాణా ప్రతాప్ యువజన సంఘం, రాంకోట్‌లోని మహాంకాళి దేవాలయంలో శుక్రవారం ఆగస్టు 23 వ తేదీనుండి గురువారం సెప్టెంబర్ 1 వ తేదీ వరకు రోజు రాత్రి 8-3 గంటలనుండి విశేష కార్యక్రమాలను నిర్వహించనున్నది.

రేపు సా॥ 12-30 గం॥ గొప్ప విడుదల

బాంబే పత్రికలు సమీక్షలు:

"మియా బీవి రాజీ" ఇంపైన సంగీతము, ఉత్తమ వినోదముతో ఆహ్లాదకరమైన చిత్రము! స్క్రీన్.

"మియా బీవి రాజీ" కావ్యమైన సంగీతముతో మిమ్ముల ఆనందపరచును! సన్‌డే స్టాండర్డు.

"మియా బీవి రాజీ" అద్భుత అసమానగాథా చిత్రము! టైమ్స్ ఆఫ్ ఇండియా

అనుపమచిత్రా వారు సమర్పించుచున్న "మియా బీవి రాజీ" చిత్రము అధునాతన భావములతోను అసమాన సన్నివేశములతోను ఎస్. డి. బర్మన్స్ ఇంపైన సంగీతముతోను ఉత్తమ వినోదఘట్టములతో ప్రేక్షకుల ప్రశంసలకు పాత్రమైనది! బ్లిట్జ్

తప్పక చూచితీరవలసిన కథాచిత్రము!

అనుపమచిత్రా వారి

మియా బీవి రాజీ

తా: కామినీకదమ్, మహమూద్, సీమ, శ్రీకాంత్, జీనత్, మనోరమ, రాజాగోసావి, సవితాఛటర్జీ, నిరంజన్ శర్మ, దేశిఇరాని.

దర్శకత్వం: జ్యోతిస్వరూప్. సంగీతం: ఎస్. డి. బర్మన్.

కథ, సంభాషణలు: పండిట్ ముఖరంశర్మ.

రాయల్ హైద్రాబాద్. ??? సికింద్రాబాద్.

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.

(Trupix) —కవితా పిక్చర్స్ విడుదల.

మందుగుండు సామగ్రి దొంగ ఉత్పత్తి దారుల అరెస్టు

గుంటూరులో కేసుదర్యాప్తు

(స్వ వి)

గుంటూరు, ఆగస్టు 24

లైసెన్సులేకుండా మందుగుండు సామాను తయారు చేస్తున్న కారణాన, నగరంలో శ్రీ యుతులు డి. వెంకటేశ్వరరావు డి. రాధాకృష్ణమూర్తి, షేక్ నజగర్ టి లక్ష్మయ్య గుప్త అను వారలు అరెస్టుగావించబడినారు

1958 లగాయతు కాకుమానువారి తోటలో "నల్లతాచు" (మందుగుండు సామాను) అనుదానిని లక్ష్మయ్యగుప్త అనే వ్యక్తి తయారుచేస్తూ, దానిని శివకాశికి ఎగుమతి చేస్తున్నారు ఇదంతాగూడా సువర్ణా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ సంస్థతరపున ఇక్కడ జరుగుతున్నది. కాని ఈ వ్యాపారాన్ని, ఈ తయారు చేయటాన్ని నిర్వహిస్తున్న ఈ సంస్థ లైసెన్సు పొందినదిగాదనీ, ఈ విషయమై విచారణ చేయుమనిస్థానిక పోలీసులకు ప్రేలుడు వస్తువుల ఇన్స్పెక్టరు దగ్గరనుంచి వర్తమానం రాగా, ఇచ్చటి పోలీసులు పైన పేర్కొనబడిన వారిని అరెస్టుచేశారు. డి. సరస్వతి అనునామె కోసం పోలీసులు వెదుకుచున్నారు.

మేజర్ పంచాయతీగా మాత్రమే ఇల్లెందు అర్హత

తాలూకా అధ్యక్షుని వివరణ

ఇల్లెందు, ఆగస్టు 24

ఇల్లెందు తాలూకా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ దమ్మిశాల్ చౌరస్యా ఇల్లెందు టౌన్ కమిటీ జనాభా ఆదాయము ఆ కమిటీకికల అవకాశములు ప్రస్తుత పరిస్థితులలో మేజర్ పంచాయతీగా ఏర్పడుటకు మాత్రమే వీలుకల వివరములు యీ దిగువ ప్రకటించు చున్నారు:

ఇటీవలి టౌన్‌కమిటీ సమావేశంలో ఇల్లెందు టౌన్‌కమిటిని గ్రామపంచాయతీ చట్టం ప్రకారం సిటీ మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ తీర్మానం గావించబడినది. ఈ తీర్మానం చాలా అక్రమముగా జరిగినది. సిటీ మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించాలనిన సంఘ ఆదాయము ఒక లక్ష, జనాభా పదిహేను వేలకు తక్కువ కాకుండా వుండాలి. కాని ఇల్లెందు ప్రస్తుత జనాభా 10 వేలు సుమారుగా ఉంది. ఆదాయము 70 వేలకుతక్కువ కలిగి ఉన్నది. యీ ఆదాయము, జనాభా ననుసరించిన ఏ పరిస్థితులలో కూడా సిటీ మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించుటకుగల అవకాశములు కొత్తిగాలేవు.

మేజర్ పంచాయతీగా ఏర్పాటు అయిన జిల్లా పరిషత్తు అధ్వర్యమున వ్యవహరించుటకు అవకాశములు కల్పించబడినవని సిటీ మున్సిపాలిటీగా వుండిన పరిషత్తుతో ఏ విధమైన సంబంధం లేకుండా కొంత స్వతంత్రంగా, సంఘమును నడుపుకోవచ్చునని ఉద్దేశపడి తీర్మానము చేయుట జరిగినదట.

దాదాపు (2000) గని కార్మికులు టౌన్‌కమిటీ పరియాలో ప్రస్తుతం నివాసాలు ఏర్పాటు గావించుకొని వున్నారు. గని మేనేజిమెంటువారు కార్మికుల కొరకు నివాస గృహములు కట్టిస్తున్నారు. పూర్తిగా వచ్చినవి. ఆ గృహాలలోని కార్మికులందరూ తరలిపోయిన కమిటీ జనాభా యింకా తగ్గిపోవుననికూడా తెలుస్తున్నది.

నీలం సంజీవరెడ్డి

జబల్‌పూర్, ఆగస్టు 24

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి ఆగస్టు 27 నూతన మధ్యప్రదేశ్ పర్యటన సందర్భంలో ఇక్కడికి 60 మైళ్ళదూరానగల కట్నికివస్తారు.

ఆయన అక్కడ ఉండే ఒక రోజులోనూ కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో ప్రసంగించి కట్ని పౌరసన్మానానికి హాజరవుతారు. ఆయన బహిరంగసభలో కూడ ప్రసంగిస్తారు. అక్కడాయనకు ఒక పర్సు బహూకరించ బడుతుంది. రోటరీక్లబ్ సమావేశంలో కూడ ప్రసంగిస్తారు.

మజగామ్ డాక్స్‌లో నౌకల నిర్మాణం

కొత్తఢిల్లీ, ఆగస్టు 24

బొంబాయిలోని మజగామ్ డాక్స్‌లో డిస్ట్రాయర్ సైజు నౌకలు నిర్మించబడగలవని లోక్‌సభలో రక్షణ మంత్రి కృష్ణమీనన్ తెలిపారు మజగామ్ డాక్స్ విస్తరణ పథకం ఇంకా పరిశీలనలో ఉన్నదని ఒక ప్రశ్నకు వ్రాత మూలకంగా సమాధానమిస్తూ సూచించారు.

ఆంధ్ర గ్రామీణ విద్యాబోర్డు

విశాఖపట్నం, ఆగస్టు 24

శ్రీ తెన్నేటి విశ్వనాథం అధ్యక్షతన ఆంధ్ర రూరల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పరచబడినది. ఇది గ్రామీణ విశ్వవిద్యాలయ స్థాపనకు కృషి చేయగలదు.

జనగామ తాలూకాలో అనావృష్టి

చౌకడిపోలు ఏర్పరచాలనివిజ్ఞప్తి

జనగామ, ఆగస్టు 24

"ఈ సంవత్సరము బొత్తిగా వర్షములు పడకపోవటముచే ప్రజలు బాధపడుచున్నారు. పశువులకు గడ్డికొరత నీళ్లకొరతచే రైతాంగం ఎన్నో అగచాట్లకు గురిఅవుచున్నారు. ఇట్టితరి ఆహార ధరలు ఆకాశము నందుకొంటున్నవి అధికధరలలో బీద రైతాంగానికి ఆహారధాన్యంకొనేశక్తి లోపించినది ఎచ్చట చూచినా చెరువులు, కుంటలు, నీళ్లులేక నెర్రలుపాసి వుండటముచే చెరువులక్రింద వున్న పొలములు ఎండి వరిగడ్డిమాదిరిగా అయినవి. బావులలో నీరు అడుగంటినవి. పశువులకు గడ్డి, నీరు బాధ, ప్రజలకు ఆహార బాధలు వర్ణనాతీతం. కావున ప్రభుత్వమువారు ఇవిఅన్నియు దృష్టికి తీసుకొని జనగామ తాలూకాలో చౌకడిపోలు ఏర్పరచాలి" అని జనగామ తాలూకా జనసంఘం కోరుచున్నది.

కాలేజి విద్యార్థినిని పీడించినందులకు జుర్మానా

హైదరాబాద్, ఆగస్టు 24

ఈ నెల 4వ తేదీన మహిళా కళాశాల సుల్తాన్‌బజారువద్ద ఒక కాలేజి విద్యార్థినిని పీడించినందులకు సత్యనారాయణ అను నతనిని నాలుగవ సిటీ మేజిస్ట్రేట్ సిటీ పోలీసు చట్టం సెక్షన్ 70(సి) క్రింద పది రూపాయల జుర్మానాను విధించారు.

పితృహత్యా నేరానికి ఒకని ఉరితీత

రాజమండ్రి, ఆగస్టు 24

చిత్తూరుజిల్లా బోడిమళ్ళ వారిపల్లి గ్రామకాపురస్తుడు చింతల గంగలు రెడ్డి తన తండ్రి రెడ్డప్పని హత్యచేసిన నేరానికి చిత్తూరుజిల్లా అదవపు సెషన్సు జడ్జి అతనికి మరణదండన విధించాడు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ శిక్షను ఖాయపరిచింది. నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలులోఆగస్టు 10వ తేదీన ఉరితీశారు.

కావలెను

ప్రఖ్యాతిగాంచిన జ్యోతి ఎలక్ట్రిక్ మోటార్లు, జ్యోతి కాలర్స్ ఎమాగ్ స్టార్టర్లకు దిగువ జిల్లాలలో డీలర్ షిప్పు లభించును.

వరంగల్	కర్నూల్
నిజామాబాద్	మహబూబ్‌నగర్
కరీంనగర్	బీదర్
ఆదిలాబాద్	నల్గొండ

వ్యాపారములో పూర్వానుభవము, ఆదాయపు మార్గముల చూపు వివరములతో దరఖాస్తులు దిగువ అడ్రసుకు పంపవలెను:

మెయిన్ ఆఫీసు:- ఇండియన్ కమర్షియల్ కంపెనీ (ప్రయివేట్) లిమిటెడ్

గిన్‌వాలా బిల్డింగ్స్, మహాత్మాగాంధీరోడ్, ఫోన్ నెం: 74774, సికింద్రాబాద్.

సబ్-ఆఫీసు:- 141, రాష్ట్రపతిరోడ్, ఫోన్ నెం: 6828, సికింద్రాబాద్.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్

ప్రకటన నెం. (14) 1960-61

దిగువ నుదాహరించిన ప్రకారము ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ హెల్తు సబార్డినేటు సర్వీసులో నేరుగా రిక్రూట్ మెంటు చేయుటకు హెల్తు ఇన్ స్పెక్టరుల 800 పదవులకు 23-9-1960 సాయంత్రము 5 గం॥ వరకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(1) 1959 ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంటు (నివాసమునకు కోరబడిన) నిబంధనల ప్రకారము అర్హత అనుమతి సర్టిఫికెట్ పంపునట్టి వారు ఆంధ్రప్రదేశ్‌లో విలీనము చేయబడిన పూర్వపు హైదరాబాద్ రాష్ట్రపు హద్దులలో 15 సం॥ లేక ఎక్కువ నివాసము కలిగియున్న భారతీయులు... 800

(2) అందరికీ బహిరంగముగా 500

నోటు:- పైన పేర్కొనబడిన 1 వ అంశములో వివరించిన 800 ఖాళీలలో ప్రొబేషనరులుగా అంగీకరించబడిన అభ్యర్థులు లేక దరెగాన్ (ఆ ప్రాంతములో హెల్తు అసిస్టెంట్లు మరియు శానిటరీ సబ్ ఇన్ స్పెక్టర్లు) ధ్రువపరచు పదవులు నిర్వహించు వారలచే ఖాళీల పూర్తి చేయుటకు 150 పదవులు రిజర్వు చేయబడి యున్నవి.

(II) పైన పేర్కొనబడిన 2 వ అంశంలో వివరించిన 500 ఖాళీలలో రాష్ట్రములోని లోకల్ బోర్డులు, మునిసిపల్ కౌన్సిల్సు నుంచి ప్రొబేషనరులుగా అంగీకరించబడిన అభ్యర్థులు లేక శానిటరీ ఇన్ స్పెక్టరులు, మొదటి తరగతి వాక్సినేటర్లు, జనన మరణ రిజిస్ట్రారులు, రిజిస్ట్రారు- వాక్సినేటర్లు మరియు లైసెన్స్ ఇన్ స్పెక్టర్ల ధ్రువపరచు పదవులు నిర్వహించు వారలచే ఖాళీల పూర్తి చేయుటకు 250 పదవులు రిజర్వు చేయబడి యున్నవి.

యోగ్యతలు:- దిగువ పేర్కొనబడిన లేక సమానమైన యోగ్యతలు (స్వదేశీ లేక విదేశీ);

(I) ఈ సందర్భములో ప్రభుత్వముచే ఏర్పాటు చేయబడిన బోర్డాఫ్ డైరెక్టరుల చైర్‌మన్‌గా మద్రాసు లేక ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్తు డైరెక్టరుచే ఇవ్వబడిన శానిటరీ ఇన్ స్పెక్టర్స్ సర్టిఫికెట్టు లేక తెలుగు, ఉర్దూ, మరాఠీ, లేక కన్నడ భాషలలో కనీసము ఏదైనా ఒక భాషలో వ్రాయుట, చదువుట తెలిసి యుండవలెను. (iii) పర్యటన చేయుటలో శరీర దార్ఢ్యత;

వయస్సు:- (i) ఆంధ్ర ప్రాంతంలోని లోకల్ బోర్డులు లేక మున్సిపల్ కౌన్సిల్స్ నుండి వచ్చు అభ్యర్థుల విషయములో 1-7-1958 నాటికి 35 సంవత్సరములలోపు, తెలంగాణలో దరెగాన్ మరియు శానిటరీ సబ్- ఇన్ స్పెక్టరులు ప్రొబేషనరులుగా అంగీకరించబడిన లేక ధ్రువపరచు పదవులు నిర్వహించు అభ్యర్థులు కనీసము ఐదుసంవత్సరముల సర్వీసు పొందిన వారికి 1-7-1958 నాటికి 45 సంవత్సరములుండవలెను.

(ii) ఇతరుల విషయములో 1-7-1958 నాటికి 25 సంవత్సరముల లోపు వుండవలెను.

నోటు:- వయః పరిమితి తగ్గింపు ఇవ్వబడిన తరగతుల వ్యక్తుల విషయము గురించి కమీషన్ యొక్క "అభ్యర్థులకు సూచనలు మున్న గు వాటని" 4, 11 పేరాలలో పేర్కొనబడియున్నవి. 45 సంవత్సరముల గరిష్ఠ వయః పరిమితిని అంగీకరించబడిన వారి విషయములో 4 వ పేరా వర్తించదు. వేతనము:- నెలకు రూ. 75-8-105-4-125-5-150.

పూర్తి వివరములు మరియు దరఖాస్తు ఫారములను సెక్రెటరీ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్, హైద్రాబాద్ నుండి, పదవి పేరు తెలుపుతూ, మరియు సరైన స్టాంపుతోను, స్వంత అడ్రసుగల కవరుతోను, వ్రాత మూలకముగా దరఖాస్తు పంపిన పొందవచ్చును. అట్టి కవరుజత పరచని దరఖాస్తులు పరిశీలించబడవు.

షరా:- స్వంత చిరునామాగల కవరు 9" పొడవుతో, 15 న. పైసా విలువగల స్టాంపు కలిగి యుండవలెను.

Edted Printed and Published by N. Narotham Reddy M. A. for the Golkonda Publications Ltd at the Golkonda Printing Press Hyderabad A. P.